ఎంబీబీఎస్ విద్యార్థిని సన్మానించిన విలేకర్ల బృందం



నవతెలంగాణ-కంగ్టి

మండలకేంద్రానికి చెందిన సిర్మ రాంరెడ్డి (ఆంధ్రజ్యోతి విలేకరి) కూతురు అఖిలరెడ్డి మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సంపాదించడంతో.. రాంరెడ్డి తోటి విలేకరులు సంతోషం వ్యక్తం చేస్తూ స్థానిక ఎంపిడీఓ కార్యాలయంలో తండ్రి, కూతురులను శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నూకల రాజు మాట్లాడుతూ.. తమతోపాటు విలేకరిగా పనిచేస్తూ.. ఓ ప్రణాళిక ప్రకారం కూతురిని చదివించడంతో ఆ తల్లిదండ్రుల కల నెరవేరిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు రావడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు కంతే శ్రీనివాస్, ప్రవీణ్, సంగ్రాం, మారుతిరెడ్డి, విజయ్, రమేష్,సంతోష్ రెడ్డి,మోహిన్, జలీల్, నాగప్ప, సల్మాన్, పంచాయతీ సెక్రెటరీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సామ్రాజ్యవాదానికి, మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా చే స్ఫూర్తితో పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, డివైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మహిపాల్ పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేగువెరా తన డాక్టర్ కొలువును వదిలేసి ఎర్రజెండా, తుపాకీ చేతపట్టి ప్రజల కోసం పోరాడాడని కొనియాడారు. అలాంటి గొప్ప మహానుభావుడు ఆశయాలను ఈ తరం యువత ముందుకు తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్, శ్రీచరన్, డివైఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దసరా రద్దీ...

- ప్రత్యేక బస్సులు అరకొరే..
- దూర ప్రాంతాల నుంచి ఊరి బాట
- 25 శాతం అదనపు ఛార్జీల భారం
- ప్రత్యేక బస్సులు నడుపుతం : ప్రభులత, ఆర్ఎం, మెదక్

డిపో	మొత్తం బస్సులు	ప్రత్యేక బస్సులు
జహీరాబాద్	85	20
నారాయణఖేడ్	55	15
సంగారెడి	86	18
మెదక్	96	11
నర్సాపూర్	24	5
సిద్దిపేట	97	12
గజ్వేల్‌ప్రజ్ఞాపూర్	66	14
దుబ్బాక	33	4





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

దసరా పండగ వేళ ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ ముందు రెండు రోజులు ఆ తర్వాత మరో మూడు రోజుల పాటు ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశముంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో నడిచే బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదనపు బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నా అవి రద్దీని తట్టుకునే పరిస్థితి లేదు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు నడిచే ఎక్స్‌ప్రెస్, లెగ్జరీ బస్సుల్ని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. రద్దీ బాగా పెరిగితే ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేయాలని ఆర్టీసీ యోచిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

మెదక్ రీజియన్ పరిధిలో 8 బస్ డిపోలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్, దుబ్బాక, సిద్దిపేట, మెదక్ జిల్లాలో నర్సాపూర్, మెదక్ డిపోలున్నాయి. అన్ని డిపోల్లో కలిపి 542 ఆర్టీసీ బస్సులున్నాయి. గతంలో 600 బస్సుల వరకు నడిచేవి. బస్సుల కాల పరిమితి మీరడంతో మూలన పడుతున్న వాటి స్థానంలో కొత్త బస్సులు రాకపోవడంతో జనం రద్దీగా ప్రయాణం చేయడం తప్పట్లేదు. ప్రస్తుతం నడుస్తున్న బస్సుల్లో ఆర్టీసీ సంస్థకు చెందినవి 334 మాత్రమే ఉండగా అద్దె బస్సులు మాత్రం 208 వరకు ఉన్నాయి. మెదక్ రీజియన్ పరిధిలో నడుస్తున్న బస్సులు నిత్యం తిరిగే ప్రయాణికుల రద్దీ మేరకు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

దూర ప్రాంతాల నుంచి వారితో దసరా రద్దీ

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిద గ్రామాలు, పట్టణాలకు చెందిన వాళ్లు దూర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రిత్యా ఉంటున్నారు. వాళ్లంతా కూడా దసరా పండుగ కోసం సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ఐదు రోజుల క్రితమే విద్యా సంస్థలకు సెలవులు రావడంతో ఈ మూడు రోజుల పాటు విద్యార్థులతో బస్సులన్నీ కిక్కిరిపోయాయి. ఇతర ప్రయాణికులకు కాలుమోప సందులేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు సైతం తమ లగేజీతో ప్రయాణం చేసేందుకు కుస్తీ పట్టాల్సి వచ్చింది. గురువారం సద్దుల బతుకమ్మ పండగ ఉంది. దీంతో ఆడపడుచులు అమ్మగారి ఇంటికి దూరంగా ఉంటున్న కుటుంబాలు సొంతూరికి బయలుదేరి వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరు, చీరాల, నెల్లూరు, కాకినాడ, అమలాపురం, తిరుపతి, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి వస్తున్నారు. అదే విధంగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా దసరా పండగ కోసం వస్తున్నారు. అయితే హైదరాబాద్ నుంచి జహీరాబాద్, హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్, హైదరాబాద్ నుంచి మెదక్, హైదరాబాద్ నుంచి సిద్దిపేట, హైదరాబాద్ నుంచి సంగారెడ్డి రూట్లల్లో ప్రయాణులకు అధికంగా ఉంటున్నారు. దసరా పండగకు తప్పని సరిగా సొంతూళ్లకు వెళ్లాలనే తపనతో బయలుదేరిన ప్రజలకు గమ్యస్థానాలకు చేరేందుకు వీలుగా బస్సు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారు. రీజియన్ పరిధిలో నడుస్తున్న బస్సులు సరిపోకవడంతో అదనపు ట్రిపులు నడుపుతున్నారు. అయినా రద్దీకి సరిపోకపోవడంతో ప్రయాణికులు ప్రయివేట్ వాహనాల్ని ఆశ్రయించాల్సి వస్తుంది. నారాయణఖేడ్, జహీరాబాద్ నుంచి ప్రయివేట్ వాహనాల్లో హైదరాబాద్‌కు పోవడం, రావడంతో ఛార్జీల భారం పడుతుందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

100 ప్రత్యేక బస్సులు

దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దిని తట్టుకునేందుకు ఆర్టీసీ అదనంగా ప్రత్యేకంగా బస్సుల్ని నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. పండగ ముందు, తర్వాత ఐదు రోజుల పాటు రద్దీ విపరీతంగా ఉండే అవకాశమున్నందున రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సుల్ని అదనంగా నడుస్తాయి. జహీరాబాద్ డిపో పరిధిలో 20 బస్సులు, సంగారెడ్డి డిపో పరిధిలో 18, నారాయణఖేడ్ డిపో పరిధిలో 15, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో 14, సిద్దిపేట డిపోలో 12, దుబ్బాక డిపోలో 4, నర్సాపూర్ డిపోలో 5, మెదక్ డిపోలో 11 బస్సుల వరకు ప్రత్యేకంగా నడుస్తాయని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

25 శాతం అదనపు ఛార్జీల మోత

దసరా పండగకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నందున ప్రత్యేక బస్సుల పేర అదనంగా 25 శాతం ఛార్జీలను వసూలు చేస్తున్నారు. దసరా ముందు, తర్వాత రెండు మూడు రోజులు రద్దీ అధికంగా ఉంటున్నందున ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీలు వసులు చేయాలని సంస్థ చూస్తుంది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లో ఉన్నది. అయితే బస్సులు సరిపడ లేకపోవడంతో వాళ్లు సైతం ప్రత్యేక బస్సులు, లెగ్జరీలో ప్రయాణిస్తే ఛార్జీల భారం తప్పట్లేదు. ఆర్టీసీ బస్సుల్లో కాలుమోపే పరిస్థితి లేనందున ఇతర ప్రయివేట్ బస్సులు ఎక్కినా ఛార్జీలు తప్పట్లేదు. ఇప్పటికే నారాయణఖేడ్, ఇతర ప్రాంతాల్లో నడిచే లెగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదు. వీటిని పెంచితే ప్రయాణికులపై ఛార్జీల భారం తప్పదు. పల్లె వెలుగు బస్సుల్ని సైతం పట్టణ ప్రాంతాల్లో తిప్పి ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసులు చేస్తారు. ఊర్లల్లో నడిచే పల్లెవెలుగు బస్సుల్ని ఎక్స్‌ప్రెస్ బోర్డు వేసి పట్టణాల్లో తిప్పితే పల్లెల్లో బస్సుల్లేక ఆటోల్ని ఆశ్రయించాల్సి వస్తుంది. తెలంగాణ బస్సులు సరిపడ లేకపోవడంతో బీదర్-హైదరాబాద్ రూట్‌లో కర్ణాటక, మహారాష్ట్ర బస్సుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రయివేట్ టాక్సీలు, ట్రావెల్స్ వాహనాలు కూడా నడుస్తుండడంతో వాటిల్లో ప్రయాణించక తప్పట్లేదు. దీంతో ప్రయాణికులపై ఛార్జీల భారం పడుతుంది.

రద్దీకి తగ్గట్లుగా ప్రత్యేక బస్సులు: ప్రభులత, మెదక్ రీజియన్ మేనేజర్

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రయాణికుల రద్దీ మేరకు ఆర్టీసీ బస్సుల్ని నడిపేందుకు సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేశాం. ఆంధ్రాతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేవాళ్లు, అక్కడి నుంచి వచ్చే వాళ్ల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుస్తాయి. సంస్థ సిబ్బంది ప్రజల ప్రయాణ సదుపాయం కోసం అదనపు డ్యూటీలు కూడా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రయాణికుల కోసం ఆయా ప్రాంతాల్లో ఆర్టీసీ సిబ్బంది ఏఏ ప్రాంతాలకు ఎప్పుడు బస్సులు వెళ్తున్నాయనే సమాచారం ఇచ్చేందుకు మైక్‌సెట్ ద్వారా సిద్ధంగా ఉంటారన్నారు. అదనపు సదుపాయాల్ని కూడా కల్పిస్తున్నామన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



నవతెలంగాణ-మునిపల్లి

కడుపు నొప్పి భరించలేక నాలుగు రోజుల క్రిత పురుగులు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి గ్రామానికి చెందిన మన్నే శ్రీశైలం(51) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడంతో ఈనెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా పరిస్థితి విషమించి అతడు బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మన్నే అనుసుజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి శివారులో గల ఆర్యన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో దర్గా దగ్గర స్పృహ లేకుండా ఓ వ్యక్తి పడి ఉండటాన్ని హనుమాన్ నగర్ చెందిన నర్సింహులు గుర్తించాడు. వెంటనే డయల్ 100, 108 అంబులెన్స్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానాకి తరలించగా అతడు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.భాస్కర్ తెలిపారు. మృతుడు చాల రోజుల నుంచి కింది బజార్,హనుమాన్ గుడి, దర్గా బిక్షాటన చేసుకుంటు రాత్రి సమయంలో హనుమాన్ గుడి, దర్గా సమీపంలో పడుకునేవాడు ఆయన తెలిపారు. మృతుడు నలుపు రంగు షర్ట్ మరియు బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడి వయసు 45-50 ఏండ్లు ఉంటుందని.. ఎత్తు 5.7 ఉంటుందన్నారు. అతడి ఆచూకీ తెలిస్తే సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ నంబర్ 08455-276333, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు 8712656718 ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

నియామక పత్రాలు పొందిన వారికి పలువురి అభినందనలు



నవతెలంగాణ-జహీరాబాద్

డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోవడానికి జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న అభ్యర్థులను కలిసి టీఎస్‌యూటీఫ్ నాయకులు శ్యామ్‌రావు, సంగ్రామ్, సువర్ణ, సిరాజుద్దీన్, పీఆర్టీయూ నాయకులు తులసిరామ్ రాథోడ్‌లు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంఈఓలు బస్వారాజ్, న్యాల్కల్ మారుతి రాథోడ్, ఝరాసంగం శ్రీనివాస్ బానోత్, మొగుడంపల్లి ఎండి జాఫర్ అలీ, సీఆర్‌పీలు ఉన్నారు.

రైతుల సమక్షంలో 'టోరి సూపర్' నూతన గడ్డిమందు ఆవిష్కరణ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండంలోని భైరాన్‌పల్లి గ్రామంలో ట్రాక్టర్ బ్రాండ్ ఇన్సెక్టిసైడ్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటకు సంబంధించి టోరి సూపర్ అనే కొత్త గడ్డి మందును రైతుల సమక్షంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ రీజినల్ మేనేజర్ భీష్మాచారి మాట్లాడుతూ.. టోరి సూపర్ అనే గడ్డి మందును మొక్కజొన్నలో పిచికారి చేయడంతో అన్ని రకాల గడ్డి జాతులు చనిపోతాయన్నారు. మొక్కజొన్న పంటలో గడ్డి మందులు పిచికారి చేసే సమయంలో కలుపుమందు కలుపుకునే విధానం కూడా మార్కెట్లోలో దొరికే వివిధ మందులతో పోలిస్తే చాలా సులువుగా ఉంటుందన్నారు. ట్రాక్టర్ బ్రాండ్ ఇన్సెట్ సైడ్ ఇండియా కంపెనీ టోరి సూపర్ అనే మందును ఎకరానికి 600 గ్రాముల చొప్పున వాడుకోవాలన్నారు. అలాగే గడ్డి మందుల పిచికారి చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ బ్రాండ్ ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ గడిపే అనిల్ కుమార్, సేల్స్ ట్రెయిని ఉపేందర్, కంపెనీ డీలర్ ఇమ్మడి బాల్ రెడ్డి, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు నిర్మించాలి

- హామీల అమలుకై నిరంతరం పోరాటం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట జిల్లా కొమరవెల్లి మండలంలోని ఐనాపూర్ గ్రామంలో సీపీఐ(ఎం) పార్టీ శాఖ మహాసభ జరిగింది. సందర్భంగా పార్టీ జెండాను మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఫంక్షనల్‌లో జరిగిన మహాసభ కర్రోల ఎల్లయ్య, ఉల్లంపల్లి సాయిలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, 18 ఏండ్లు నిండిన మహిళలందరికీ మహాలక్ష్మి పథకం కింద రూ. 2500లు ఇస్తామని 9 నెలలు గడిచిన హామీ అమలు కాలేదని, ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు లేని ప్రతి పేదవానికి ఇల్లు కట్టిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నప్పటికీ ఇందిరమ్మ కమిటీల పేరుమీద కాలయాపన చేస్తుందని, ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం బలోపేతమైన ఉద్యమాలను నిర్మించాలన్నారు. ఐనాపూర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు, త్రాగునీటి సమస్యలపై పార్టీ కార్యకర్తలు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్ల బండి శశిధర్, మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, ఎండీ గొరేమియ, కానుగుల రాజు, సున్నం యాదయ్య, పాశం చంద్రయ్య, దెయ్యాల పోచయ్య, పబ్బోజు నవీన్, వుల్లంపల్లి నర్సవ్వ, తేలు నవనిత, బరిగే అంజలి, ఏనుగుల శ్రీనివాస్, సబ్బని శ్రీనివాస్, సీఐటీయూ గ్రామ అధ్యక్షులు దండు రవి, హామాలీ సంఘం నాయకులు తేలు నరసింహులు, దండు బాల్ నర్సయ్య, మెతుకు కృష్ణ, కిషన్ రవి, కనకయ్య శంకరయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హారీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ సంస్కృతి , సాంప్రదాయలకు ప్రతీకైనా బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరు సంతోషంగా చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరిశ్‌రావు అన్నారు. బతుకమ్మ పండుగా సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, అలాంటి సంస్కృతి మన తెలంగాణలో ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ, వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. తొమ్మిది రోజుల పాటు తిరొక్క పూలతో ప్రతి రోజు వేడుకగా ఆడపడుచులు చేసుకున్న గొప్ప పండగ అని, చివరి రోజు సద్దుల బతుకమ్మ పెద్ద బతుకమ్మగా చేసుకుంటామన్నారు. గ్రామాల్లో చెరువుల వద్ద, వాగుల వద్ద ఇంటిల్లిపాది సద్ది కట్టుకొని పోయి పంచుకొని తినే పండుగా అని అన్నారు. ఈ పండుగను ప్రజలందరు వేడుకగా, ఆనందోత్సాహాలతో చేసుకోవాలని కోరుకున్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ-రాయికోడ్

రైతుల అభివృద్ధే ప్రభుత్వధ్యేమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీయార్డులో బుధవారం నిర్వహించిన నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో మాట్లాడుతూ.. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో అందరం కూర్చుని మాట్లాడుకొని చర్చించుకున్న తర్వాతనే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం ముమ్మాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్, నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య మాజీ జెడ్పిటిసి మల్లికార్జున పాటిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింలు ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఏసయ్య, తాజా మాజీ సర్పంచ్లు కేదార్నాథ్, పటేల్ మండల నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి మెడికల్ కాలేజీ పూర్తి చేయాలి

- ఎమ్మారై స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి
- పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు
- సంగారెడ్డి సిపిఎం పార్టీ ఏరియా రెండో మహాసభలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మెడికల్ కళాశాల పూర్తి చేసి.. ఎమ్మారై స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, పేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, రాజీవ్ పార్క్ మరమ్మత్తులు నిర్వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి. జయరాజ్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా రెండో మహాసభ కామ్రేడ్, బుద్ధదేవ్ భట్టాచార్యనగర్ స్థానిక బాబానగర్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి జి. జయరాజ్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సంగారెడ్డి మెడికల్ కళాశాల పూర్తి చేసి ఎమ్మారై స్కానింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ లేక ప్రయివేటు స్కానింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందన్నారు. పేదలకు ఉండడానికి జాగలేక అనేక ఇబ్బందులు పడుతున్నా..వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పినప్పటికీ.. పేదలు వేసుకున్న గుడిసెలు కూల్చడం ఎంతవరకు సమంజసమన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలో పార్కులకు రక్షణ లేకుండా పోతున్నదన్నారు. సంగారెడ్డిలోని అనేక పార్కులను మరమ్మత్తులు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి సంగారెడ్డి పట్టణంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. లేని యెడల ప్రజలను ఐక్యం చేసి ప్రభుత్వం పై పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, నాయకులు యాదగిరి, బాలరాజు, శ్రీనివాస్, ప్రభాకర్, మహేష్, హనుమంతు, కృష్ణ, నర్సింలు, మురళి పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుడికి అండగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందజేత



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలిచారు. యాజమాన్యంతో చర్చించి కార్మికుడు కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా మగ్దంపూర్ గ్రామానికి చెందిన సుంకరి యాదగిరి గత కొద్ది రోజుల క్రితం జిన్నారం మండలం కాజిపల్లి గ్రామ పరిధిలోని ఆరోరా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధుల్లో చేరాడు. ఇటీవల పరిశ్రమలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. యాజమాన్యంతో చర్చించి కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించారు. కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

పండగకు కూడా వేతనాలివ్వరా?

- నేడు జీతాలివ్వకుంటే.. పనులు బంద్
- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కి వినతి



నవతెలంగాణ-జహీరాబాద్

మున్సిపల్ కార్మికులకు పండగపూట కూడా జీతాలు చెల్లించకపోతే.. వారి కుటుంబం పండుగ ఎలా జరుపుకుంటుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ ప్రశ్నించారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండగ పూట కూడా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా అధికారులు, ప్రభుత్వం రేపు మాపు అంటూ కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నుంచి మున్సిపాల్టీకి రావాల్సిన కోటికి పైగా వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ప్రతినెలా వేతనాలు ఇవ్వాలనీ, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా ప్రభుత్వం నుండి మున్సిపాల్టీకి రావల్సిన డబ్బులు వస్తాయని.. నేడు కార్మికులందరికీ వేతనాలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఒకవేళ నేడు వేతనాలు ఇవ్వకుంటే పనులు బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోహన్, దత్తు, గౌస్ తదితరులున్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఏర్పాటు చేయాలి

- నారాయణఖేడ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి
- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి వినతి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు.. నారాయణఖేడ్ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖేడ్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులు, బీటీరోడ్లు, సీసీరోడ్లకు అవసరమైన నిధులు కేటాయించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. అలాగే కమ్యూనిటీ హాల్స్, ఇండోర్, అవుట్డోర్ స్టేడియం, అంగన్వాడి భవనాలు ఇతర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని వినతిపత్రం ద్వారా కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా నియోజకవర్గానికి మొదటి విడతలోని మంజూరు అయ్యేవిధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక యోచనే విజయానికి సోపానం





నవతెలంగాణ-పటాన్‌చెరు

సృజనాత్మకంగా ఆలోచించడం, విమర్శనాత్మక ఆలోచనలను అమలు చేయడం, వాస్తవ-ప్రపంచ సవాళ్ల ద్వారా సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటివి రోబోటిక్స్ రంగంలో రాణించడానికి తోడ్పడతాయని కిరణ్ మాటిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగానికి చెందిన 'జీ-ఎలక్ట్రా' క్లబ్ బుధవారం 'రోబోటిక్స్ 1.0' పేరిట ఒకరోజు కార్యశాలను నిర్వహించింది. దేశంలోని ఐఐటీలు, ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు జాతీయ స్థాయిలో నిర్వహించే సాంకేతిక పోటీల్లో పోటీపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను గీతం ఇంజనీరింగ్ విద్యార్థులలో పెంపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. కిరణ్‌తో పాటు ఎంబెడెడ్ డెవలపర్లు రజనీకాంత్ సేన్, హేమలు ఈ కార్యశాలలో ముఖ్య శిక్షకులుగా వ్యవహరించారు. ఏదైనా రోబోటిక్స్ ప్రాజెక్టుకి జట్టు సమష్టి కృషి సహకారం చాలా కీలక మని, ఇందులో ఎదురయ్యే అపజయాలను విజయాలకు సోపానాలను మలచుకోవాలని వారు నొక్కి చెప్పారు. హ్యాకథాన్, రోబోటిక్స్, ఒలింపియాడ్ పేరిట ప్రతియేటా దేశవ్యాప్తంగా జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు నిర్వహిస్తుంటారని, వాటిలో పోటీ పడడానికి పేర్లు ఎలా నమోదు చేసుకోవాలో కిరణ్ మాటిక్స్ సభ్యులు వివరించారు. కృత్రిమ మేథతో స్వతంత్రంగా వ్యవహరించే రోబోట్‌లు, మనుషుల ప్రమేయంతో నడిచే రోబోట్‌లు, వాటిని నిర్మించడానికి అవసరమైన ఛాసిస్, మోటార్లు, వివిధ రకాల చక్రాలు, బ్యాటరీలు, స్విచ్ లు,) ఆర్డినో యునో, జాయ్ స్టిక్స్, ఇన్-ఫ్రారెడ్ (ఐఆర్) సెన్సార్లు, ఎల్ఎస్ఆ ర్టీ అల్గోరిథం వంటి పరికరాలు, అవి పనిచేసే విధానాలు వారు విశదీకరించారు. ప్రాథమిక రోబోటిక్ సిస్టమ్‌లను నిర్మించడం, నిర్వహించడం వంటి వాటిపై విద్యార్థులకు కిరణ్ మాటిక్స్ సభ్యులు మార్గనిర్దేశం చేస్తూ, వారికి ప్రయోగాత్మక అనుభవాన్ని అందించారు. అందులో చురుకుగా పాల్గొని స్వీయ అనుభవం గడించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. తొలుత, జీ-ఎలక్ట్రా అధ్యక్షుడు ఎం.సాయికృష్ణ స్వాగత వచనాలతో కార్యశాల ప్రారంభం కాగా, విద్యార్థి సమన్వయకర్త జేమ్స్ వందన సమర్పణతో ముగిసింది. అధ్యాపక సమన్వయకర్త ఎం.నరేష్ కుమార్ దీనిని పర్యవేక్షించారు. గీతం విద్యార్థులకు రోబోటిక్స్ పై అవగాహన కల్పించి, వారిని జాతీయ సాంకేతిక పోటీల్లో పాల్గొని, రాణించేలా ఈ కార్యశాల ఎంతగానో ప్రేరేపించింది.

నూజివీడు ఎన్‌సీఎస్-7788తో అధిక దిగుబడులు

- అధిక సాంద్రత పత్తి సాగుకు ఇది అనువైన రకం
- కంపెనీ ప్రతినిధులు



నవతెలంగాణ-చేర్యాల: అధిక సాంద్రత పత్తి సాగుకు నూజివీడు వారి ఎన్‌సీఎస్-7788 అనువైన రకం అని ఆ కంపెనీ ఎస్ఆర్ఎం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన రైతు నర్సింహులు సాగు చేసిన నూజివీడు ఎన్‌సీఎస్-7788 రకాం గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నూజివీడు సీడ్స్ రైతులకు 50 ఏండ్లుగా సేవలు అందిస్తున్నదన్నారు. వ్యవసాయి రంగంలో ఆధునిక పద్దతులను అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. కాగా అధిక సాంద్రత పత్తి సాగు అనే నూతన పద్ధతి గురించి గత రెండేండ్లుగా రైతులకు నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ పద్ధతిలో ఎకరానికి 5 ప్యాకెట్లను 90×15 సెంటిమీటరు చొప్పున విత్తుకోవాలన్నారు. తద్వారా ఎకరానికి 29,600 మొక్కలు వస్తాయన్నారు. నాటిన 45, 60, 75 రోజులకు మొఫిక్వట్ క్లోరైడ్(చమత్కార్) మందును పిచికారీ చేయాలన్నారు. దాంతో కాయలు దగ్గర దగ్గర వస్తాయన్నారు. అదేవిధంగా యాజమాన్య పద్దతులు పాటించడం ద్వారా ఎకరానికి 17 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది రైతులు పాల్గొని.. నూతన పద్దతులు అందిస్తున్న నూజివీడు సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్, రైతులు పాల్గొన్నారు.

దేవీ మండపంలో శ్రీకాంత్‌రెడ్డి దంపతుల పూజలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో గల దుర్గా దేవీ మండపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి దంపతుల బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీయేడు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించి తీర్థప్రసా దాలను తమ కుటుంబం తరఫున అందజేస్తున్నామ న్నారు. అలాగే జహీరాబాద్ నియోజకర్గ వివిధ పార్టీ నాయకులకు, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
గురువారం | 10 అక్టోబర్ 2024 | www.navatelangana.com

డీఎస్సీలో సెలెక్ట్ అయిన వారికి ఎమ్మెల్యే అభినందనలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి జిల్లాలో నారాయణఖేడ్ నుంచి ఎక్కువగా ఉద్యోగాలు సాధించిన ఎస్జిటి, ఎస్ఏ అభ్యర్థులను ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన పది నెలలలోపే డీఎస్సీ వేసి ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వడం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. డీఎస్సీలో సెలెక్ట్ అయిన అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోపలు మండలాల ఎంఈఓలు, డీఎస్సీ సెలెక్ట్ అయిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్

నవతెలంగాణ-రాయికోడ్



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 60 రోజుల టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0ను బుధవారం రాయికోడ్‌లో చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మండల కేంద్రమైన రాయికోడ్‌తో పాటు చిన్నాపూర్ చౌరస్తాలోయువత పొగాకు వాడకవిచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. యువత పొగాకు వాడకం పట్ల దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బీడీ, సిగరెట్, జరదా, గుట్కా, పాన్ మసాలాలు యువత తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే వివిధ రకాల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపి రితిత్తులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశంలో పొగాకు తాగిన ప్పుడు వారి పిలిచిన పొగను ఇతరులు పీల్చడం ద్వారా వారు కూడా రోగాల బారిన పడుతున్నార న్నారు. తద్వారా చిన్న వయస్సులోనే అకాల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కాబట్టి యువత పొగాకు తీసుకోవద్దన్నారు. అలాంటి వారికి ఆరోగ్యశాఖ టెలిమానస్ 14416 ద్వారా కౌన్సిలింగ్ ఇస్తారని చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో గల మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం చతుర్ధ వార్షికోత్సవ కళ్యాణం మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులుఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్ కుమార్, వెంకటేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీధర్‌చారి, చంద్రశేఖర్, వడ్ల కాలప్ప, దయానంద్ చారి పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో రూ.77 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బతుకమ్మ ఘాట్, హై మాస్ట్ లైట్లను బుధవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఘాట్ ఆవరణలో జమ్మి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ అని అన్నారు. బొల్లారం మున్సిపల్ ప్రజల కోసం అన్ని వసతులతో బతుకమ్మ ఘాట్ నిర్మించడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి, వైస్ చైర్మెన్ అనిల్ కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కౌన్సిలర్ చంద్రారెడ్డి, హనుమంత్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి,కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జహీరాబాద్ : స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతు కమ్మ సంబరాల్లో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజా చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీయేడు లాగానే ఈసారి కూడా కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించామన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రాములు నేత, మోతీరాం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లి : మండలంలోని చిన్న చెల్మెడలోని అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులతో కలిసి అంగన్వాడి కార్యకర్తలు బతుకమ్మ పండుగను ఘనంగా జరిపారు. రంగురంగుల పూలలో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబురంగా గడిపారు. అనంతరం బతుకమ్మ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళ్లర్పించిన మఠం బిక్షపతి

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు గడిండ్ల లింగమయ్య గౌడ్ భౌతికకాయానికి ట్రేడ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మెన్ మఠం బిక్షపతి బుధవారం నివాళి అర్పించారు. మృతుని మనుమడు, బీజేపీ పట్టణ యువత నాయకులు రవీంద్ర గౌడ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కూడా అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన లేని లోటు మరువలేనిది అన్నారు.

పీఈటీగా నియామక పత్రాన్ని అందుకున్న గాండ్ల రాజు



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం గ్రౌండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వ్యాయామ ఉపాధ్యాయ (పీఈటీ)గా నియామక పత్రాల ను అందుకున్నారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పీఈటీ విభాగంలో సంగారెడ్డి జిల్లా టాపర్‌గా రావడంతో తనకు ఈ అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-మునిపల్లి



మండలకేంద్రమైన మునిపల్లిలో బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వ హించే వేడుకల, నిమజ్జనం చేసే స్థలాన్ని ఎంపీడీఓ హరి నందన్ రావు బుధవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం లో మహిళలకు అతి ప్రాముఖ్యమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. అలాంటి ఈ పండుగలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పా టు చేయాలన్నారు. అంతకుముందు కంకోల్‌లోని నర్సరీ సబ్ సెంటర్‌ను, ముని పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలవకుండాజాగ్రత్తలు తీసుకోవాలని వైద్యానికి కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాలని అక్కడి అధికారులకు సూచించారు.

ఛలో కలెక్టరేట్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు



నవతెలంగాణ-జహీరాబాద్

ఎస్సీల వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తున్న దని కలెక్టరేట్ ఎదుట బుధవారం చేపట్టిన నిరసనకు జహీరాబాద్ నుంచి ఎమార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఉల్లాస్ మాదిగ ఇంచార్జ్, మైకల్, సుకుమార్, రవికుమార్, ఎమ్.సునీల్ కుమార్, ఎన్. సుదీష్ కుమార్, రాజు,శ్రీకాంత్, చింటు, శేఖర్,లాజర్,జీవన్. పవన్. దిలీప్,అనిల్, సునీల్, విజయ్, సన్నీ,నవీన్, పౌలు తదితరులున్నారు.

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-పుల్కల్



మండలంలోని పలు గ్రామాల్లో దుర్గా భవాని మండపాట వద్ద బుధవారం అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా నవరాత్రో త్సవాల్లో భాగంగా దుర్గా భవానీ మాతకు ప్రతీరోజు మండపాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామ ంలో గల హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండప ంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వాములు, అర్చకులు సిద్దు స్వామి మూడు గంటల పాటు హోమాలతో అభిషేకం, హారతితో పూజలు చేశారు.

అతివృష్టితో వాడిన పూలతోటలు

- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా వస్తుందో లేదో అని రైతుల్లో ఆందోళన
- దిగుబడి లేకపోవడంతో పెరిగిన ధరలు
- కిలో బంతి రూ.100, ఛామంతి రూ.400
- పెరిగిన ధరలతో కాగితం పూల బతుకమ్మ వైపు ప్రజల మొగ్గు..

ఈయేడు అతివృష్టి వల్ల పూల తోటలపై తీవ్ర ప్రభావం పడింది. రోజుల తరబడి భారీ వర్షాలు కురియడంతో పూల తోటలన్నీ దెబ్బతి న్నాయి. చాలా వరకు తోటలు నీటిలోనే మురిగిపోయాయి. దాంతో పెట్టుబడి కూడా వచ్చేలా లేదని పూలతోటలు సాగు చేసే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క దిగుబడి తగ్గడంతో పూల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ ప్రభావం బతుకమ్మ తయారీపై పడింది. పెరిగిన ధరల వల్ల ప్రజలు కాగితం పూల బతుకమ్మల వైపే మొగ్గుచూపుతున్నారు.



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్, ఝరాసంగం, న్యాల్కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో బంతి, ఛామంతి, సన్నజాజు, కనకంబరాలతోపాటు మంచి మల్లెపువ్వుల తోటలను సాగు చేస్తారు. ప్రతీయేడు దసరా, దీపావళి పండగలకు వారం రోజుల ముందు పువ్వులు కోతకు వచ్చే విధంగా ప్రణాళికలు వేసుకుని రైతులు పంటలను నాటి సాగు చేస్తారు. ఈయేడు అతివృష్టి కారణంగా రోజుల తరబడి పొలాల్లో నీళ్ళు నిలవడంతో పువ్వుల తోటలన్నీ దెబ్బతిన్నాయి. అలాగే కొందరు రైతులు మామిడిపండ్ల, అరటి, జామ తోటల్లో అంతర్గతంగా బంతి, ఛామంతి పంటలను సాగు చేస్తారు. ఈ పంటలు సాగు చేసేందుకు రైతులు ఎకరాకు లక్ష నుంచి లక్ష యాభై వేల రూపాయల వరకు ఖర్చు అవుతున్నని రైతులు రాములు, నర్సింహులు చెబుతున్నారు. అయితే ఈ యేడు అతివృష్టి వల్ల పంటలన్నీ దెబ్బతిన్నాయని.. పెట్టుబడి కూడా వస్తుందో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ప్రతీయేడు బంతితోట సాగు చేసి.. జీవనాధారం పొందుతున్నామన్నారు. కాబట్టి తమకు కూడా ఇతర పంటల మాదిరిగా పంట నష్టపరిహారాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దిగుబడి లేక ఆకాశాన్నంటిన పువ్వుల ధరలు..

ఈయేడు అతివృష్టి కారణంగా పంటలు చేతికి రాకపోవడంతో పది రూపాయల నుంచి 20 రూపాయలకు కిలో విక్రయించే బంతి పువ్వులు నేడు కిలో రూ.100కు లభిస్తున్నాయి. ఛామంతి పూలు కిలో రూ.400, సన్న జాజులు మూర రూ.60, కనకంబరాలు మూర రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

కానరాని బతుకమ్మల జోష్..

పువ్వుల ధరలు ఆకాశాన్ని అంటడంతో బతుకమ్మల జోష్ కానరా వడం లేదు. అలాగే తెలంగాణ ఏర్పడిన అనంతరం గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని బతుకమ్మ పండుగను నిర్వహించే వారు. ఈ పండగకు పట్టణంలోని పురవృధుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించి కార్యాలయాల వద్ద బతుకమ్మ సంబరాలను నిర్వహించే వారు. బతుకమ్మ చీరలను పంపిణీ చేయడంతో ప్రతీ కుటుంబంలోని ఆడపడుచులు అదరూ నూతన వస్త్రాలను ధరించి బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు వచ్చేవారు. ఈయేడు ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేయకపోవ డంతో కూడా బతుకమ్మ సంబరాల్లో జోష్ కనపించడం లేదు.

కార్యాలయాల్లో నామమాత్రంగా సంబురాలు..

ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ సంబురాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ సంబరాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఏ కార్యాలయంలో కూడా అనుకున్న స్థాయిలో జరగడం లేదు. దానికి తోడు పూలపంటలు సక్రమంగా రానందున పువ్వుల ధరలు పెరగడంతో బతకమ్మ సంబరాల నిర్వహణకు ఖర్చు పెరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు.

వీధుల్లో కానరాని సంబురాలు..

ఎంగిలిపూలతో మొదలైన బతుకమ్మ సంబురాలు సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగా వైభవంగా జరిగేవి. అయితే పువ్వుల ధరలు పెరగడంతో పాటు ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు నూతన వస్త్రాలను పంపిణీ చేయకపోవడంతో విధుల్లో బతుకమ్మ సంబరాలు కానరావట్లేదు.

విక్రయానికి తంగేడి, గునుగు పూలు..



పంట పొలాల్లో సాధరణంగా కనిపించే గునుగు పువ్వు లు, రోడ్ల వెంబడి కనిపించేటటువంటి తంగేడి పువ్వులు ఈసారి పట్టణ ప్రాంతాల్లో విక్రయానికి రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. పువ్వుల పంటలు సాగు కానందున బతుకమ్మ సంబరాలు నిర్వ హించేందుకు గునుగు పువ్వు లు, తంగేడు పువ్వు లకే ప్రాధాన్యత ఇవ్వటంతో పట్టణ ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు వాటిని కోసుకోవచ్చే పది రూపాయలకు కట్టచొప్పున విక్రయిస్తున్నారు.

గునుగు పూలు కూడా దొరకట్లేదు



ఈ యేడు గునుగు పూలు కూడా ఎక్కువగా దొరకడం లేదు. ఎత్తైన ప్రాంతంలో మాత్రమే అక్కడక్కడ కొన్ని లభిస్తున్నాయి. నేను సాగు చేస్తున్న సన్నజాజి, ఛామంతి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాంతో గునుగు, తంగేడి పూలను తీసుకు వచ్చి విక్రయిస్తున్నాను.

\- నారాయణ

పూలతోటల సాగు రైతులను ఆదుకోవాలి



ఈ సంవత్సరం అతివృష్టి కారణంగా పువ్వుల తోటలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన ప్రభుత్వం ఆదుకోవాలి. నాకు ఉన్న మూడెకరాల పొలంలో ప్రతీయేడు లక్షల రూపాయల పువ్వులను పండించి హైదరాబాద్లోనే పువ్వుల మార్కెట్‌కు విక్రయించేందుకు తరలించే వాడిని. ఈసారి మా ఇంట్లో కూడా బతకమ్మ పేర్చడానికి పువ్వులు లభించడం లేదు.

\- రాములు, రైతు

నూతన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలి

- ప్రతీ కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి
- మట్కా గ్యాంబ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- పండుగ సెలవుల దృష్ట్యా పెట్రోలింగ్, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ పై దృష్టి పెట్టాలి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రైమ్ రీవ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్ఓలు ప్రతీరోజు ఉదయం సిబ్బందితో రోల్‌కాల్ నిర్వహించి.. వారు చేయాల్సిన పని గురించి వివరిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చేయాలన్నారు. ప్రతి కేసులో ఎస్‌హెచ్‌ఓలు నేరస్థలాన్ని సందర్శించి, నేరస్థల ఫోటోగ్రఫీ తీయించాలని, వీలైనంత తొందరగా నేరస్థలానికి చేరుకొని నేరస్థలాన్ని ప్రొటెక్ట్ చేయాలన్నారు. ఏ కేసులో ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని తన అనుభవ పూర్వక సలహాలు సూచనలు చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించడానికి ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. ముఖ్యంగా గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, జిల్లాలో ఎలాంటివి అక్రమ రవాణా జరగకుండా, తరచూ వెహికిల్ చెకింగ్ నిర్వహిస్తూ, అనుమానిత వెహికిల్స్ ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచిం చారు. మట్కా గ్యాంబ్లింగ్ నిర్వాసితులపై ప్రత్యేక నిఘా ఉంచి, ముంద స్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. నేరాలను అదుపు చేయడానికి, జరిగిన నేరాలను డిటెక్ట్ చేయడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఎక్కువగా ఆత్మహత్యలకు పురుగుల మందునే వినియోగిస్తున్నారని, ఆత్మహత్యలు నివారించడానికి ఫర్టిలైజర్స్ షాప్ యజమానులతో మాట్లాడి, అనుమానిత వ్యక్తులకు ఫర్టిలైజర్స్ అమ్మకుండా, రైతులకు మాత్రమే అమ్మే విధంగా గైడ్ చేయాలని సూచించారు. నూతన చట్టాల ప్రకారం అవసరం ఉన్న కేసుల్లో ముందస్తుగా డీఎస్పీ నుంచి అనుమతి పొంది ప్రథమ విచారణ చేసిన తరువాతనే కేసు నమోదు చేయాలన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మునిపల్లి



స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుదేరా చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివ పేట పట్టణానికి చెందిన సాయి కిరణ్(29) కోహీర్ మండలం దిగ్వాల్‌లో మంగళవారం జరిగిన తన బావమరిది అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం తన భార్య వసంతతో కలిసి స్కూటీపై సదాశివ పేట పట్టణానికి తిరిగి బయల్దేరాడు. ఈ క్రమంలో మునిపల్లి మండలం బుదేరా చౌరస్తా వద్దకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీ అదుపుతప్పి డీవైడర్‌ను ఢీ కొట్టింది. దాంతో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా పటాన్‌చెరు అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరులో 4 కోట్ల 77 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-పటాన్‌చెరు



శరవేగంగా విస్తరిస్తున్న పటాన్చెరు డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటిక, మున్నూరు కాపు ఫంక్షన్ హాల్, అంబేద్కర్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీల్లో నాలుగు కోట్ల 77 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహా రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమీకృత దుకాణాలు వినియోగంలోకి తేవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత దుకాణాలను వేలంపాట ద్వారా అద్దెదారులకు కేటాయించి ఏండ్లు గడుస్తున్నా.. నేటికీ దుకాణాలను ఎందుకు అప్పగించడం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం డిమాండ్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ.. 2019లో సమీకృత కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం ప్రారంభించగా.. 2022 నవంబర్ లో పూర్తి అవ్వగా ప్రారంభోత్సవం కూడా చేశారన్నారు. ఈ సముదా యంలో సెల్లార్‌లో కూరగాయలు, మాంసం విక్రయాలకు 84 స్టాల్స్, గ్రౌండ్ ఫ్లోర్‌లో 33 దుకాణాలు, మొదటి ఫ్లోర్‌లో 34 దుకాణాలు ఉన్నాయన్నారు. ఈ దుకాణ సముదాయాన్ని 2022 నవంబర్‌లోనే వేలం వేసి లబ్దిదారులకు కేటాయించారని.. ఒక్కొక్కరి దగ్గర డిపాజి ట్‌గా రూ.50,000లు అనగా మొత్తంగా సుమారు రూ.35 లక్షలు సేకరించారు. ఒక్కో దుకాణానికి రూ.20వేల నుంచి రూ.60 వేల వరకు అద్దె నిర్ణయించారన్నారు. ఈ లెక్కన నెలకు రూ.20లక్షల వరకు అద్దె వచ్చేదన్నారు. కానీ రెండేండ్లు కావస్తున్నా.. ఇంత వరకు వాటిని వినియోగంలోకి తేకపోవడం ఏంటని ప్రశ్నించారు.కొత్తగా ప్రభుత్వం వచ్చి సుమారు సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు ఈ భవన సముదాయాన్ని ఉపయోగంలోకి తీసుకొని రాకపోవడం పూర్తిగా ప్రభుత్వ అసమర్థతే అన్నారు.

మంత్రికి తాళం చెవులు ఇచ్చి నెలలు గడుస్తున్నది..

నియోజకవర్గం అభివృద్ధిపై మంత్రి దామోదర్ రాజనర్సింహా స్థానిక మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో సదరు కాంట్రాక్టర్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన తాళాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారన్నారు. అయినా నేటికీ వాటిని వేలంపాటల్లో పాడిన వారికి ఎందుకు అప్పగించడం లేదని నరోత్తం ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రి పట్టించుకోని తక్షణమే సామూహిక దుకాణాల కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.లేని యెడల దుకాణాలను దక్కించుకున్న వారితో కలిసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



నవతెలంగాణ-కోహిర్

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ రైతు వేదికలో ఉద్యానవన, వ్యవసాయశాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చేయాల నుకునే రైతులకు మొక్కలను 90శాతం రాయితీ, డ్రిప్ ఏర్పాటుకు 80 శాతం నుంచి వంద శాతం రాయితీ ప్రభుత్వమే అందిస్తున్నదన్నారు. పంటను కంపెనీయే కొంటుందని, దీని కోసం కోహిర్ మండల్ లోనే ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మండల వ్యవసాయ ఏవో నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చేసే వారు అంతరపంటలు కూడా వేసుకోవచ్చు అన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బిక్షపతి, తహసీల్దార్ బాలశంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, అర్బికల్చర్ మండల అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులందరిని కన్వర్షన్ చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వం వెంటనే ఆర్టిజన్ కార్మికులందరిని కన్వర్షన్ చేయాలని టీవీఏసీ జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సింగి రెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా బాడీసమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్టిజన్లను మోసం చేసిందన్నారు. పలుమార్లు అసెంబ్లీలో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పి.. అటు కాంట్రాక్టు, ఇటు పర్మినెంట్ కాకుండా చేసి ఆర్టిజన్లను మోసం చేశారని మండిపడ్డారు. ఆర్టిజన్‌లు చేయడానికి కూడా అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. అన్ని సంఘాలు అంటే ఈ సంగారెడ్డి గడ్డమీద ఉన్న వివిధ సంఘాల నుంచి వచ్చిన ఆర్టిజన్ ఉద్యోగులందరికీ రాష్ట్ర కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. ఆర్టిజన్ ఉద్యోగులకు టీజీయూఈఈ యు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమ్ మధు మద్దతు తెలిపారు. ఈటీవీఏసి, జేఏసీ సంగారెడ్డి జిల్లా చైర్మెన్‌గా రాములు నాయక్, కన్వీనర్‌గా ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆయుధ పూజ

నవతెలంగాణ-మునిపల్లి



మండల కేంద్రమైన మునిపల్లి సబ స్టేషన్‌లో అమ్మవారికి విద్యుత్‌శాఖ అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పరికరాలను శుభ్రం చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో మునిపల్లి ఏఈ ప్రశాంత్, సిబ్బంది జమాల్, సోహెల్, సదాశివుడుతదితరులు పాల్గొన్నారు.



జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెంగా నియమితులైన మక్త జగన్మోహన్ రెడ్డిని అందోల్ జోగిపేట మున్సిపల్ 17వవార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక కౌన్సిలర్ నివాసంలో ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాటాడుతూ.. జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో జోగిపేట ప్రథమ స్థానంలో ఉండేలా సేవలు అందించాలని సూచించారు. చైర్మెన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు జగన్మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
3
మెదక్
గురువారం | 10 అక్టోబర్ 2024 | www.navatelangana.com

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు



నవతెలంగాణ-టేక్మాల్

పేదలకు అందాల్సిన సంక్షేమ బియ్యం అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న టేక్మాల్ పోలీసులు, మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు టేక్మాల్ ఎస్సై రాజేష్ సిబ్బందితో లీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బియ్యం తరలిస్తున్న బులోరా వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యానికి సంబంధించిన పత్రాలు ఆధారాలు లేకపోవడంతో పోలీసులు రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ సాయి శ్రీకాంత్ను సంఘటన స్థలానికి పిలిపించుకొని పంచనామా నిర్వహించి బియ్యాన్ని సాధీనం చేసుకున్నారు. అనంతరం పాపన్నపేట మండలం వెంకటేశ్వర రైస్ మిల్లుకు తరలించి అక్కడ భద్రపరిచామని ఎస్సై రాజేష్ తెలిపారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన తహసీల్దార్



నవతెలంగాణ-మనోహరాబాద్

మండలంలో మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 57 చెక్కులు మంజూరైనట్టు తెలిపారు. ఇందులో 41 చెక్కులు పంపిణీ చేయగా మరో నాలుగు గ్రామాలకు చెందిన పోతారం, పరికిబండ, తుపాకులపల్లి, గౌతజిగూడ గ్రామాలకు చెందిన 16 చెక్కులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం లబ్ధిదారులకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక రెడ్డి, ఆర్ఐ దీక్షిత్, జూనియర్ అసిస్టెంట్ సంపత్లతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.


కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన 76 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు గౌరీ శంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మేఘమాల సంతోష్ కుమార్, మాజీ ఎంపీపీ మంజుల కాశీనాథ్, సంతోష్ రావు, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఆంజనేయులు, ఆరట్ల ఎల్లయ్య ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సుహాసిని రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కౌడిపల్లి

ఘనంగా జిల్లా గ్రంధాలయ చైర్మెన్ చిలుముల సుహాసిని రెడ్డి బుధవారం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంతమంది వేడుకలకు వచ్చి నన్ను ఆశీర్వదించినందుకు సంతోషకరమన్నారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిలప్ చెడు మాజీ జెడ్పీటీసీ శేష సాయి రెడ్డి, చంద్రం కృష్ణ గౌడ్, కౌడ శ్రీనివాస్ గుప్తా, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మల్లేశం, వెంకటేష్ గుప్తా, లక్ష్మణ్ యాదవ్, అడ్వకేట్ చిరంజీవి, విజయ్ గౌడ్, జెకి, కిషన్, మాటూరిశాఖయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

- ప్రజా సేవకుడు అయిత పరంజ్యోతి



నవతెలంగాణ-చేగుంట

పట్టణానికి చెందిన మిట్టపల్లి సంజీవ్ అనారోగ్యంతో మరణించాడు. బుధవారం విషయం తెలుసుకున్న ప్రజా సేవకుడు అయిత పరజ్యోతి మృతుడి దహన సంస్కారాలకు రూ.5 వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సురేఖ ఎల్లేష్, తిరుపతి, వీరభద్రియ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-టేక్మాల్

చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన, మండల పరిధిలోని పుసంగి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముసలపురం యాదయ్య (50) మేకల మేపుకొని జీవనం సాగిస్తూ ఉంటాడు. రోజు లాగానే సోమవారం మేకలను తోలుకొని శివారుకు బయలుదేరారు. ఎంతకు తిరిగి రాకపోవడంతో బంధువులకు చెప్పి, చుట్టుపక్కల వెతికిన కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఓ మృతదేహం పుసంగి పెద్ద చెరువులో తేలి ఆడుతుందని తెలపడంతో కుటుంబీకులు, బంధువులు వెళ్లి చూడగా యాదయ్య చెప్పులు బట్టలు చెరువుగట్టు పైన ఉన్నాయని గుర్తించి, చెరువులో తేలుతున్న బాడీ యాదయ్యదే అని పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని చెరువులో నుంచి బయటకు తీసి, కుటుంబీకులకు అప్పజెప్పారు. మృతికి ఎవరు కారణం కాదు అని కుటుంబీకులు తెలిపారు.

దుర్గ మాత వద్ద అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో విజయదశమి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వెంక టేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గోల్కొండ కిషన్ రావు దేశ్‌ముఖ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతగా నిలిచి అక్కడున్న భక్తులకు అన్నదానం చేశాడు. ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని, ఆయురారోగ్యాలతో, పాడిపంట, సుఖశాంతులతో ప్రజలందరూ బాగుండాలని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో దేవీ భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

నవతెలంగాణ-చేగుంట

తెలంగాణ పూల బతుకమ్మ పండుగ ముగింపు చివరి రోజు సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని మండలంలోని, గ్రామ ప్రజలకు మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. పుడమి పులకరించే సింగిడి రంగుల పూల వైభవం ప్రకృతి పరవశించే తీరొక్క వర్ణాల బతుకు సంబరం, పువ్వులు నవ్వులు విరబూసే సహజీవన సౌందర్యం ఇచ్చిపుచ్చుకునే వాయినాల అచ్చమైన ఆనంద పరిమళం నిండిన చెరువుల నీటి అలలపై ఉయ్యాలలూగే గౌరమ్మలని అన్నారు.

పోలీస్‌స్టేషన్‌లోనే మహిళా ఏఎస్ఐ ఆత్మహత్యాయత్నం

ఫ్యాన్‌కు ఉరేసుకుని అఘాయిత్యం.. కాపాడిన హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది



నవతెలంగాణ-చిలిపిచెడ్

పోలీస్ స్టేషన్‌లోనే ఓ మహిళా ఏఎస్ఐ ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన హెడ్ కానిస్టేబుల్ సిబ్బందితో కలిసి కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మెదక్ జిల్లా చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

మెదక్ జిల్లా చిలిపిచేడ్ పోలీస్‌స్టేషన్లో ఏఎస్ఐ సుధారాణి గత రెండేండ్లుగా విధులు నిర్వస్తున్నారు. అయితే బుధవారం రాత్రి 9:30 గంటలకు పోలీస్ స్టేషన్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. గమనించిన హెడ్ కానిస్టేబుల్ సాదయ్య ఇతర సిబ్బందితో కలిసి ఆమెను కాపాడి.. జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉన్నట్టు పోలీస్ సిబ్బంది తెలిపారు.

సూసైడ్ లెటర్ రాసి అఘాయిత్యం..

ఏఎస్ఐ సుధారాణి సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాగా ఆ సూసైడ్ నోట్‌లో 'మా ఎస్ఐ సార్.. గత రెండు మూడు రోజులుగా కంటిన్యూగా విధులు చేయిస్తూ ఒకరోజు రెస్టులో వెళ్లిన నాకు ఆబ్సెంట్ వేయిస్తూ.. ప్రతీసారి చిన్నచిన్న దానికి ఆబ్సెంట్ పెట్టాను రాసి ఇవ్వు అంటున్నాడు.....' అని లేఖలో పేర్కొంది.

ఈ విషయంపై ఎస్సై యాదగిరిని వివరణ కోరగా.. ఎస్సై వేధిస్తున్నాడని అనేది అవాస్తవమన్నారు. విధులకు హాజరుకావాలని రెగ్యులర్‌గా సిబ్బందికి సూచిస్తానన్నారు. విధులకు లేటుగా వస్తున్నావు.. నీ డ్యూటీ నువ్వు సక్రమంగా చేసుకో అని చెప్పినట్టు తెలిపారు. ఇదివరకు డీఎస్పీ వెంకటరెడ్డి, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఉన్నప్పుడు సుధారాణిని శివంపేటకు ట్రాన్స్ఫర్ చేస్తామని తెలుపగా ఇదివరకే సూసైడ్ చేసుకుంటానని బెదిరించిందని ఇలాంటి ఘటన బెదిరింపులతో ఉద్యోగాన్ని నడపలేరన్నారు.

తెలంగాణ పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం

- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

తెలంగాణ పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానమని, రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. సుమారు గంట పాటు మహిళలు బతుకమ్మ ఆడిపాడి , పలు శాఖల మహిళా ఉద్యోగులు తయారు చేసిన బతుకమ్మలతో జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం సందడి వాతావరణం నెలకొంది. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఇందిరా మహిళా శక్తి మెదక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ వంటకాల ప్రదర్శన, జిల్లా పర్యాటక శాఖ పర్యాటక ప్రదేశాలు స్టాల్ కలెక్టర్ పరిశీలించారు. బతకమ్మ ఉత్సవాల ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ఎంతో గనమైన పండుగని ఈ పండుగ మన తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుందని అన్నారు. తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు అందరూ కలిసి తీరొక్క పూలును బతుకమ్మలుగా పేర్చి ఆడుకునే గొప్ప పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ మన సంస్కృతికి అద్దం పడుతున్నదని, బతుకమ్మ పండుగను అందరు సంతోషంగా చేసుకోవాలని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఇలాంటి సంస్కృతి మన తెలంగాణలోని ఉందని తెలిపారు. మన పండుగ, సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అనితెలిపారు. అనంతరం డీఆర్‌డీఓ బతుకమ్మకు మొదటి బహుమతి, మెప్మా డిపార్ట్మెంటుకు ద్వితీయ బహుమతి, మహిళా శిశు సంక్షేమ శాఖకు తృతీయ బహుమతి జిల్లా కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, డీడబ్ల్యుఓ బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిర, డీసీఓ కరుణ, అడిషనల్ డీఆర్డీఓ సరస్వతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరేందర్, కార్యదర్శి రాజ్ కుమార్, సంబంధిత అధికారులు జిల్లాలోని తెలంగాణ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు, అన్ని శాఖల అధికారులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ పర్మినెంట్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-మనోహరాబాద్,తూప్రాన్

మెదక్ జిల్లాలో ఉన్న పరిశ్రమలన్నింటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పర్మనెంట్, క్యాజువల్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని యాజమాన్యాలు బోనస్ అమలు అమలయ్యేలా ప్రభుత్వం, జిల్లా లేబర్ అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మనోహరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1965 బోనస్ చట్టం ప్రకారం పరిశ్రమ లాభనష్టాలకు సంబంధం లేకుండా కార్మికులందరికీ బోనస్ చెల్లించాలన్నారు. కనీస బోనస్ రూ.7వేలు లేదా 8.33 శాతం లాభాల్లో ఉన్న 20 శాతం వరకు బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుం దన్నారు. వార్షిక ఏడాది 30 రోజుల్లో పనిచేసిన బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుందని కానీ కొన్ని పరిశ్రమల యజమాన్యాలు చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మికులకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. బోనస్ ఇవన్నీ పరిశ్రమలన్నిటిపై కేసులు నమోదు చేయాల ని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ బోనస్ వచ్చేలా చర్య లు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు బోనస్ ఇవ్వని పరిశ్రమలపై ప్రత్యక్ష కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

మెదక్ జిల్లాలో ఉన్న పరిశ్రమల న్నింటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పర్మనెం ట్, క్యాజువల్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని యాజమాన్యాలు బోనస్ అమలు అమలయ్యేలా ప్రభుత్వం, జిల్లా లేబర్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తూప్రాన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1965 బోనస్ చట్ట ప్రకా రం పరిశ్రమ లాభనష్టాలకు సంబంధం లేకుండా కార్మికులం దరికీ బోనస్ చెల్లించాలన్నారు. కనీస బోనస్ రూ.7వేలు లేదా 8.33 శాతం లాభాల్లో ఉన్న 20 శాతం వరకు బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుందని అన్నారు. వార్షిక ఏడాది 30 రోజుల్లో పనిచేసిన బోనస్ ఇవ్వాలని చట్టం తెలుపుతుం దని కానీ కొన్ని పరిశ్రమల యజమాన్యాలు చట్టాన్ని ఉల్లంఘి స్తూ కార్మికులకు బోనస్ ఇవ్వడం లేదని అన్నారు. బోనస్ ఇవన్నీ పరిశ్రమలన్నిటిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ బోనస్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు బోనస్ ఇవ్వని పరిశ్రమలపై ప్రత్యక్ష కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

- జిల్లా జడ్జి లక్ష్మీ శారద



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని తూప్రాన్‌కు కోర్టు మంజూరు బుధవారం అయినందున ఇంటిగ్రేట్ మార్కెట్ భవనానికి ఎదురుగా ఉన్న నూతన భవనాన్ని, అల్లాపూర్ శివారులోని ప్రైవేట్ భవనాన్ని జిల్లా జడ్జి లక్ష్మీ శారద అధికారులతో కలిసి కోర్టు భవనాలను పరిశీలించారు. గతంలో కూడా తూప్రాన్‌లోని పుట్టకుట్ల ప్రాంతంలో ఉన్న పాత హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. గతంలో పరిశీలించిన భవనాలు కోర్టుకు అనుకూలంగా లేకపోవడంతో మళ్లీ నూతన భవనాలను. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్రా రెడ్డి, డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగాకృష్ణ, ఇన్చార్జి తహశీల్దార్ మన్నె ప్రభుదాస్, మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఆర్ఐ నాగరాజు, ఎస్ఐ శివానంద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

బడుగు బలహీన వర్గాల స్ఫూర్తిదాత కాన్షిరాం

- బీఎస్పీ మండల అధ్యక్షులు టప్ప భానుచందం



నవతెలంగాణ-చేగుంట

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్ఫూర్తిదాత మన్యశ్రీ కాన్షిరామని మండల బీఎస్పీ మండల అధ్యక్షులు టప్పా భానుచందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరామ్ 18వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్య ఈ దేశ సమస్య అని నూటికి 85 శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని ఓట్లు మావి సీట్లు మీవా అనే నినాదంతో దేశంలో ప్రకంపనలు సృష్టించిన మహా నేత కాన్షిరాం అని బీసీల రిజర్వేషన్ల కోసం మండల్ కమిషన్ అమలు చేయించిన ఘనత కాన్సిరాం గారికే దక్కుతుందని, దేశంలో బహుజన్ సమాజ్ పార్టీ ఏర్పడడం వల్లనే మనువాద పాలకులు వెన్నులో వణుకు మొదలైందని, దేశ రాజకీయాల్లో చెరగని చిరునామా కాన్షిరాం అని దేశంలోని బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారం దక్కినప్పుడే ఆయనకు నిజమైన ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుతడి నరసింహులు, నాయకులు జనార్దన్ గౌడ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగల ద్రోహి

- అసెంబ్లీలో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా డీఎస్సీ నియామకాలను అని మోసం
- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాపేట యాదగిరి మాదిగ

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ముఖ్యమంత్రి రెడ్డి మాదిగల ద్రోహి అని, సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ తెలంగాణలో అన్ని రాష్ట్రాల కంటే ముందే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి మాదిగను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాయిపేట్ యాదగిరి మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలను మాటలతోని మురిపిస్తు, మాలలతో కుమ్మక్కై ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయం అన్నారు. మాదిగల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి మార్చుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఊషన్నగల్ల మురళి మాదిగ, కొమ్ము శేకులు మాదిగ, దండోల్ల సామేల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మాధవి మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా అధికార ప్రతినిధి ముక్క వినోద్ మాదిగ, పాల్గొన్నారు

కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- తూప్రాన్ ఇన్చార్జి తహసీల్దార్ మన్నే ప్రభుదాస్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ తహశీల్దార్ మండల కార్యాలయం వద్ద కల్యాణ లక్ష్మి షాధిముబారక్ 74 చెక్కుల తూప్రాన్ ఇంచార్జి తహసీల్దార్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ జ్యోతికృష్ణ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మీషాధి ముబారక్ చెక్కులను మున్సిపల్ చైర్ పర్సన్ సమక్షంలో లబ్ధిదారులకు అందించారు. స్థానిక గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ రాకపోవడంతో ఇప్పటివరకు కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందించడం ఆగిపోయాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నర్సారెడ్డి చొరవతో చెక్కుల పంపిణీ జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు భగవాన్ రెడ్డి, రాజు, రవీందర్ రెడ్డి, నాయకులు నర్సోజీ, రవీందర్ రెడ్డి, రవీందర్ గుప్తా, రఘుపతి, కాంగ్రెస్ నాయకులు జింక మల్లేశం, వెంకటేష్, అంజినేయులు, గౌతమ్ గౌడ్, సిద్ధిరాములుగౌడ్, వెంకట్ గౌడ్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

2కే రన్ విజయవంతం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్






నవతెలంగాణ-మెదక్ టౌన్

బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ విజయవంతంగా నిర్వహించారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం మెదక్ స్టేడియం చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై 2కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లాలో క్రీడాకారులు యువత పాల్గొని ఉత్సాహభరితమైన వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు భావితరాలకు చాటి చెప్పే విధంగా జిల్లాలో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకుం టున్నాం న్నారు. ఈ సంబరాల్లో భాగంగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు 2కే రన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టామని చెప్పారు. జిల్లాలోని పిల్లలకు వ్యాచారచన, క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో అతి పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని, తెలంగాణ ఆడబిడ్డలు పెద్ద ఎత్తున చేసుకుం టారని ఆ సంస్కృతిని మనం ఇంకా కొనసాగించే విధంగా ప్రచారం కల్పించే విధంగా పగడ్బందీగా చర్యలు తీసుకుం టున్నామన్నారు. మహిళలకు, బాలికలకు ఎంతో ప్రాముఖ్య తనిస్తూ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో కూడా పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి, వై దామోదర్ రెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కే రామచంద్రరాజు, క్రీడాకారులు, క్రీడాకారిణులు, పోలీస్ యంత్రాం గం పాల్గొన్నారు.

మండలాల్లో పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ- వెల్దుర్తి

గతంలో డీఎస్సీ నిర్వహించగా డిస్టిక్ సెలక్షన్ కమిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు వ్యక్తులకు బుధవారం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా టీచర్ ఉద్యోగాలకు నియామక పత్రాలు అందు కున్నట్లు పలువురు వ్యక్తులు తెలిపారు. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోచి ప్రవంతి, కామెంట్ల నాగరాజు, ఇద్దరికీ ఎస్ జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. వెల్దుర్తి మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన సిహెచ్ దినాకరన్, అనూష భార్య భర్తలు దినాకరన్ ఎస్జీటీ, అనూష స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఉద్యోగానికి ఎంపిక అయినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి కూడా ఎంపికైనట్లు తెలి పారు. బండ పోసాని పల్లికి చెందిన నాగారపు ఆనంద్, చాకలి శ్రీనివాస్, మంగళపర్తి గ్రామానికి చెందిన జాలిగామ అనిల్, రెడ్డిపల్లి సత్యనారాయ ణ, వెల్దుర్తి పట్టణానికి చెందిన రవీందర్, ఉపాధ్యాయ ఉద్యోగాల నియామక పత్రాలను అందుకున్నట్లు తెలిపారు. వీరు సాధించిన టీచర్ ఉద్యోగాలకు కుటుంబ సభ్యులు, బంధువు మిత్రులు అభినందనలు తెలిపారు.

నియామక పత్రాలకు తరలిన డీఎస్సీ అభ్యర్థులు



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ స్థానిక బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో డీఎస్సీలో ఎంపికైన 272 అభ్యర్థులను టీజీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంకి తరలించే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ జెండాతో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డీఎస్సీ 2024 నియామకల్లో భాగంగా మెదక్ జిల్లా నుంచి 272 అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి బస్సులో ఇద్దరు ఎంఈఓలను లైజన్ ఆఫీసర్స్‌గా నియమించామని, వీరితో పాటు మెడికల్ డిపార్ట్మెంట్ నుంచి ఒక హెల్త్ అసిస్టెంట్, పోలీస్ కానిస్టేబుల్ ఉన్నారన్నారు. వీరందరికి జిల్లా కలెక్టర్ నర్సాపూర్‌లో భోజన వసతి ఏర్పాటు చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పూజలు చేసిన ఎమ్మెల్యే రోహిత్ దంపతులు



నవతెలంగాణ-పాపన్నపేట

దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు ఆయన సతీమణి శివాణి ఏడుపాయల్లో దుర్గమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు చదువుల తల్లి (శ్రీ సరస్వతీ దేవి) అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. వీణధారి అయిన దుర్గమ్మను తెలువు రంగు వస్త్రాలతో అలంకరించారు. వేద బ్రహ్మణులు సనాతన శర్మ శంకరశర్మ, పార్థివశర్మ అమ్మ వారికి పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి చెందాలి. ప్రజలకు దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని, పంటలు బాగా పండాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇఓ చంద్రశేఖర్ ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఆయన వెంట కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోవింద్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, గౌస్, ప్రశాంత్ రెడ్డి, భరత్, నిరలాక్షప్ప, నరెందర్ గౌడ్, ఆశోక్, బొజ్జ పవన్, తదితరులు ఉన్నారు.

- నేడు మహిషాసుర మర్థినిగా దుర్గమ్మ

ఏడుపాయల దుర్గమ్మ గురువారం మహిషాసుర మర్థినిగా భక్తులకు దర్శణమిస్తారు.అమ్మవారిని ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరిస్తారు.

ఓటమి.. గెలుపునకు నాంది

- సంతోష్ రావు సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కొల్చారం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు సంతోష్ రావు ఆధ్వర్యం లో దసరా పండుగను పురస్కరించుకొని గ్రామీణ స్థాయి కబడ్డీ ఛాంపియన్ లీగ్ 3 పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆమె బహుమతులు అందజేశారు. ప్రథమ విజేతగా పొందిన రాజు జట్టుకు రూ.12వేలు, షీల్డ్, ద్వితీయ విజేతగా నిలిచిన భూపాల్ జట్టుకు రూ. 6వేలు, షీల్డ్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారులను వారి నైపుణ్యాలను వెలికితీస్తూ ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. అలాగే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, వారి ప్రతిభను గుర్తించడంలో ఇది ఒక వేదికన్నారు. అనంతరం విజేతలుగా పొందిన జట్లకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మోత్కు మల్లేశం, మాజీ సర్పంచ్లు వెంకటేశం, రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గౌరీ శంకర్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కొలువులతో నిరుద్యోగులకు వెలుగు

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్



నవతెలంగాణ-గజ్వేల్

గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధ్యాయ కొలువుల జాతర వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపుతుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. బుధవారం నూతన ఉపాధ్యాయ అభ్యర్థులు గజ్వేల్ ఐఓసీ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ సర్టిఫికెట్లు పొందటానికి హైదరాబాదులోని ఎల్బీ స్టేడియం బయలుదేరుతున్న వారిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గౌరవంతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుఖెందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, అశోక్ రెడ్డి, నక్క రాముడు, డప్పు గణేష్, గుంటుకు బిక్షపతి, సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

మాదకద్రవ్య వ్యసనం అంతులేని బాధలకు కారణమైతుందని, యువత మంచి మార్గంలో నడుచుకుంటూ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని ఎస్ఐ ఓ.దామోదర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రవల్లిలో మర్కుక్ పోలీస్ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్-క్రికెట్ టోర్నమెంట్‌ను జగదేవపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కమ్మరి బాలరాజు, ఎర్రవల్లి స్పోర్ట్స్ యూత్ సభ్యులతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. యువత గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా యువతలో ఉత్సాహం, అందరితో కలిసి స్నేహపూర్వకమైన వాతావరణంలో జీవించేలా ఉండేందుకు టోర్నమెంట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి స్పోర్ట్స్ యూత్ సభ్యులు కృష్ణ, శేఖర్, నాయకులు తుమ్మ కృష్ణ, అవులకాడి పరుశురాం, సత్యం, వివిధ గ్రామాల యువత తదితరులున్నారు.

నిజాయితీ చాటుకున్న వృద్ధురాలు



నవతెలంగాణ-సిద్దిపేట

తనకు దొరికిన చెక్కుడు సంచిని బాధితురాలకు అప్పగించమని ఇచ్చిన పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన బాచవేణి లక్ష్మిని ఆన్ డ్యూటీ బస్టాండ్ ఇంచార్జి ఆకుల రాజేందర్ ఆమె నిజాయితీని అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. న్యూబస్టాండ్ క్యాంటిన్లో పనిచేస్తూన్న లక్ష్మికి ఈనెల 7న సిద్దిపేట నుంచి ప్రజ్ఞాపూర్ వెళ్లుచున్న గట్టు యాదమ్మ తన కూతురు, ఆమె పిల్లలతో బస్సు ఎక్కడానికి రాగానే రద్దీగా ఉండడం వల్ల ఆతృతతో చెక్కుడు సంచి చేర్ యందు మరిచిపోయి, బస్సు ఎక్కి వెళ్లినట్లు తెలిపారు. ఆ సంచిని గమనించిన లక్ష్మి దానిని తనకు దొరికిందని, డ్యూటీలో ఉన్న తనకు అందించినట్లు తెలిపారు. అందులో చూడగా రూ.2 వేల నగదు, ఒక్క ఫోన్ బుక్ ఉన్నదని, ఈ సమాచారాన్ని వారికి తెలిపి, వారిని ఈ రోజు పిలిపించి, డిపో మేనేజర్ సూఖేందర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి సూచనతో సెక్యూరిటీ సమక్షంలో వారికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌ను పరామర్శించిన మాజీ వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-తొగుట

పీఏసీఎస్ డైరెక్టర్‌ను మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. బుధవారం జప్తి లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ బీఆర్ఎస్ నాయకులతో కలిసి డైరెక్టర్‌ను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బక్క కనకయ్య, దోమల కొమురయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీధర్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సిలివేరి మల్లారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, పులిందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

టెర్రకోట మట్టి గిరక లభ్యం





నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తన పొలంలో టెర్రకోట గిరకను గుర్తించాడు. ఇది 5 అంగుళాల ఎత్తు, 3అంగుళాల వెడల్పుతో అద్భుతమైన పనితనంతో ఉన్న మట్టిగిరక. నీళ్ళు తోడడానికి వాడినదా, లేక మగ్గం కట్లకు వాడినదా అని సందేహం. ఈగిరకకు ఉన్న గాడిలోతు, అంచుల వంపును బట్టి దీని మీద మందపు తాళ్ళను వాడినట్లు అరిగిన గుర్తులు కనిపిస్తున్నాయి. ఈ మట్టి గిరక వయస్సు 2వేల ఏండ్లుంటుందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ అభిప్రాయపడ్డారు.

కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చిన అధికారులు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, ముస్త్యాల, గ్రామాల మధ్య ఉన్న చిన్నవాగు కల్వర్టుపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులకు కల్గే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, బుధవారం కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలను తాత్కాలికంగా మట్టి పోయించి మరమ్మతులు చేశారు. దీంతో వాహనదారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

కాంగ్రెస్ పోరాట ఫలితమే చెక్కుల పంపిణీ

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్



నవతెలంగాణ-గజ్వేల్

గత కొన్ని రోజులు గా స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుల నిర్లక్ష్య వైఖరిని ఎండ కడుతూ కాంగ్రెస్ చేపట్టి న పోరాట ఫలితంగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ జరిగిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..గత కొన్నాళ్లుగా ఎదురు చూస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీని అధికారులు చేపట్టటం హర్షణీయం అన్నారు. దసరా పండుగ సందర్భంగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేయాలని కాంగ్రెస్ గత వారం రోజులుగా పోరాటం చేస్తున్నామన్నారు. రెండు రోజుల ముందే దసరా పండుగ చేసుకుంటున్నట్టు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, వర్గల్ మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కర్ణాకర్ రెడ్డి, జగన్, సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-నంగునూరు

తమ్ముడి కుమారుడికి ఈత నేర్పేందుకు వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓబులాపూర్ గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. రాజగోపాల్ పేట ఎస్ఐ ఎం.డీ. ఆసీఫ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జక్కుల అలియాస్ కొండబోయిన ఎల్లయ్య (38) తన తమ్ముడి కుమారుడైన భానుకి ఊరు పక్కనే ఉన్న కొత్త కుంటలో ఈత నేర్పించేందుకు తీసుకువెళ్ళాడు. ఈ క్రమంలో ముందుగా చెరువులోకి దిగిన ఎల్లయ్య ప్రమాదవశాత్తు చెరువులోని నీటిలో మునిగిపోయాడు. ఈ విషయం గమనించిన తన తమ్ముడి కుమారుడు గ్రామస్తులకు తెలియజేయగా వారు అక్కడికి చేరుకునే లోపే అతడు మృతి చెందాడు. విషయాన్ని గ్రామస్తులు రాజగోపాల్ పేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పంచునామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి లక్ష్మీ ఫౌండేషన్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఇటీవల ప్రజ్ఞాపూర్ లో బీఆర్ఎస్ నాయకులు సల్ల నరేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని ప్రజ్ఞాపూర్ మూడవ వార్డు కౌన్సిలర్, లక్ష్మీ ఫౌండేషన్ అధినేత మర్కంటి కనకయ్య ముదిరాజ్ పరామర్శించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీ ఫౌండేషన్ ఎక్కడ ఆపద జరిగిన అక్కడ తమ వంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం లక్ష్మీ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. నరేష్ అందరితో కలుపుకొలుగా ఉండేవాడన్నారు. స్నేహభావంగా ఉంటూ, పార్టీలో చురుకుగా పనిచేశాడన్నారు. అనారోగ్య బారిన పడి మృతి చెందడం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు, వార్డు ప్రజలు, తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

- ఎస్ఐ అభిలాష్



నవతెలంగాణ-కోహెడ

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అభిలాష్ అన్నారు. మండలంలోని తంగళ్ళపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెదవాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వంటిమామిడి మార్కెట్లో రైతులకు మద్దతు ధర కల్పించాలి

- సందబోయిన ఎల్లయ్య సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



నవతెలంగాణ-గజ్వేల్

ములుగు మండల పరిధిలోని వంటిమామిడి మార్కెట్లో రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని, హైదరాబాద్ నుంచి వచ్చే కూరగాయల నియంత్రించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్ల య్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడారు. గతంలో ఉదయం మార్కెట్ 4 గంటలకు ప్రారంభమై7 గంటలకు ముగింపు జరిగేదని కానీ గత ఆరు నెలలుగా ఉదయం మార్కెట్ 7గంటలకు ప్రారంభమై 11 గంటల వరకు సాగుతుందన్నారు. దీంతో హైదరాబాదు నుంచి పెద్ద మొత్తంలో కూరగాయలు దిగుమతి చేసి స్థానిక రైతులకు మద్దతు ధర లేకుండా రైతు మార్కెట్లో కూరగాయల సంత లాగా అమ్మడం జరుగుతుందన్నారు. కూరగాయల కొనుగోలు దారులు ఒకే రేటు వద్ద నిర్ణయించి ఎక్కువ మొత్తంలో ధర నిర్ణయించ కుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో ఎక్కువ సంచులు ఉంటాయి అందులో సరిగా కూరగా యలు లేవని, తక్కువ సంచులే ఉన్నాయని రైతులను గందరగోళానికి గురిచేయడం జరుగుతుం దన్నారు. ఉదయం 11 గంటల వరకు మార్కెట్ నడవడం ఫలితంగా హమాలీ కార్మికులకు, మార్కెట్లో పనిచేసే గుమస్తాలకు సుమారు 1వేయ్యి మందికి ఉపాధి లేకుండా పోయిందన్నా రు. గతంలో మార్కెట్లో కొనుగోలు చేయడం వల్ల మార్కెట్ నుంచి కమిషన్ ఏజెంట్ నుంచి రైతులకు రక్షణకు ఉండేదని నేడు చిల్లరగా కొనుగోలు చేయడం వల్ల రక్షణ కరువైందన్నారు. మార్కెట్కు వచ్చే ఆదాయం కూడా గత ఆ రు నెలలు గా పడి పోయిందన్నారు. వెంటనే మార్కెట్ క్రమ పద్ధతిలో నిర్వహించాలని విడివిడిగా అమ్ముకునే వాళ్ల కు ఇతర మార్కెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో రైతులతో ఆందోళన రూపొందిస్తామన్నారు.

వరిలో ఆకు ముడత పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-జగదేవపూర్

మండలంలోని గొల్లపల్లి, దౌలాపూర్ గ్రామాల్లో సాగుచేసిన పత్తి, వరి పంటలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో ఆకు ముడత, నాము, తెల్ల తెగులు ను గమనించడం జరిగిందని పొట్ట ఆకు దశలో ఆశిస్తే నష్టం ఎక్కువని, లార్వాలు ఆకుల రెండు అంచులను కలిపి గొట్టంగా చేసి ఆకుపచ్చని పదార్థాన్ని గీకి తినడం వల్ల ఆకులు తెల్లబడి తరువాత ఎండిపోతాయన్నారు. ఈ పురుగు సీతాకోకచిలుకలు ముదురు గోధుమ రంగులో ఉండే రెక్కల అంచుల మధ్య సన్నని నల్ల గీతలుంటాయని ఆకులు నిలువుగా ముడుచుకొని తెల్ల గీతలు ఉండటం, ఆకు ముడతలు విడదీస్తే లార్వా లేదా ఆకుముచ్చ పురుగులు కనబడడం లేదా గుంపులు గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులను బట్టి ఆకు ముడతను గుర్తించవచ్చునని అన్నారు. ఆలస్యంగా నాటిన పొలాల్లో, వర్షాభావ పరిస్థి తుల్లోనూ, పొలం చుట్టూ నీడ ప్రదేశాలు ఉండటం, నత్రజని ఎరువు అధిక మోతాదులో వాడటం వల్ల ఈ పురుగు ఉధృతి పెరుగుతుంది. ముఖ్యంగా వెడల్పాటి ఆకుల రకాల్లో ఎక్కువగా ఆశిస్తుంది. పొట్ట ఆకు దశలో దుబ్బుకి ఒకటి నుంచి రెండు కొత్తగా గీకబడిన ఆకులు వాటిలో చిన్న లార్వాలు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలన్నారు. పిలక దశలో చేనుకు అడ్డంగా తాడును 2-3 సార్లు లాగితే పురుగులు క్రింద పడిపోతాయని దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా.లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. పొట్టాకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2 గ్రా.లు లేదా క్లోరాంట్రానిల్ ప్రోల్ 20 ఎస్.పి 0.4 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూజీడీ 0.25 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్. 48 ఎస్.పి 0.1 మి.లీ లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

ఇటీక్యాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జగదేవపూర్

మండలంలోని ఇటీక్యాల గ్రామంలో రావికంటి బాలయ్య పద్మ కుమారుడు రావికంటి చంద్రశేఖర్ ఆర్బీపీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్స్ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు భవిత, ఆర్థోపెడియన్ డాక్టర్ ప్రేరణ , ప్రశంస, దీప్తి , కుమార స్వాములు ,చంద్రశేఖర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చాలామందికి సీజనల్ వ్యాధులు వ్యాధులు వస్తున్నాయనే, ఎవరైనా హాస్పటల్‌కు రాని నిరుపేదల కోసం ఈహెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని పలువురు రోగులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కంటి సమస్యలకు, సంతానం లేమి సమస్యలకు, గర్భిణీలకు వరిబీజ ఆపరేషన్‌కు సంబంధించి ఉచితంగా ఆపరేషన్లు చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రావికంటి నాగరాజు, వీరేశం, మహంకాళి నాగరాజు, కందుకూరి నాగరాజు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు జానకి రాములు, సాయిలు, భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ స్వామి, దొడ్డి మహేష్, వెంకటయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల శాఖ తరపున శుభాకాంక్షలు





నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో పీఆర్టీయూ జగదేవపూర్ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్ విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ..పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర స్థాయి 35వ కౌన్సిల్ సమావేశాల్లో జిల్లాలోని జగదేవపూర్ మండలానికి రాష్ట్ర శాఖలో పలువురికి పదవులు లభించినట్లు తెలిపారు. వారిలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా వంగ శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, రఘురాములు, రాష్ట్ర ఉపా ధ్యక్షులుగా, కాయిత నరసింహారెడ్డి, రాష్ట్ర మహిళా ఉపా ధ్యక్షులుగా సంధ్యా కుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శులుగా పద్మ, అమ్మ తమ్ములు ఎన్నికయ్యారని తెలిపారు. వారి కి జగదేవపూర్ పీఆర్టీయూ మండల శాఖ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకత్వానికి జగదేవపూర్‌కు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘము కోసం పని చేయడంలో ముందుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నగేష్, అనురాధ, భగవాన్ రెడ్డి, రంజిత్ కుమార్, గోపికళ, విజయలక్ష్మి, నాయకులు బాల్ నరసింహారెడ్డి, నాగరాజు, రవీందర్ తదితరులు ఉన్నారు

మేలైన యాజమాన్య పద్ధతులతో నష్టం తగ్గించుకోవచ్చు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్టాన్ని తగ్గించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ అన్నారు. బుధవారం గాడిచర్లపల్లిలో పత్తి, వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, పురుగుమందుల వాడకం విషయంలో వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఏవోతో పాటు ఏఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు నాలుగు పతకాలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఈ నెల 7న, 8న హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు రెండు వెండి, రెండు కాంస్య పతకలు సాధించారని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాఘవపూర్‌కు చెందిన గ్యార లీలా ఆనంద్ డేకథ్లాన్, హై జంప్ రెండు విభాగల్లో 2 కాంస్య పతకలు, టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్ కొండపాకకు చెందిన నగేష్ అండర్-18 జవలియన్ త్రో వెండి పతకం, ఇదే కేటగిరీలో షాట్ పుట్‌లో వాసు వెండి పతకం సాధించారని తెలిపారు. డీవైఎస్ఓ జయ దేవ్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎస్‌జీ ఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వన్నాల రామేశ్వర్ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు బండారుపల్లి శ్రీనివాసులు, ఏరువ అశోక్ , కడకంచి ఉప్పలయ్య, కామిరెడ్డి రవీందర్ రెడ్డి, బయ్యారపు కనక రెడ్డి, శిక్షకులు ప్రభాకర్, కృష్ణ కుమార్, నిషంక్ గౌడ్, సాగర్ తదితరులు అభినందించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



నవతెలంగాణ-తొగుట

నేటి యువత క్రమ శిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పిట్ల గోపాల్ టీచర్ ఉద్యోగం పొం ది న సందర్భం గా గోపాల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపాల్ తండ్రిని చిన్నతనంలోనే కోల్పోయాడు. మాతృ మూర్తి యాదమ్మ ఎన్నో కష్టాలు పడి పెంచి పెద్ద చేయగా, సోదరుడు వెంకటేష్ సంపూర్ణ సహకారం చదువులో ముందుకి సాగారు. మొదట్లో రైల్వేలో ట్రాక్ మెన్ ఉద్యోగం సాధించి, నేడు టీచర్ ఉద్యోగంను సాధించడం గొప్ప విషయం అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. అభినంధించిన వారిలో నాయకులు సుతారి రాములు, బండారు స్వామి గౌడ్, సిరిసిల్లా రాజేష్, ఈదుగాళ్ల పర్శరాములు, జహంగీర్, కనకరాజు, నాగయ్య, బాలరాజు తదితరులు ఉన్నారు.

కులమతాలకు అతీతంగా స్వేరో సేవలు

- ఈనెల 26వ తేదీన బెజ్జంకిలో స్వేరో సమావేశం
- స్వేరోస్ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

కుల మతాలకతీతంగా స్వేరో సేవలు అందిస్తుందని స్వేరోస్ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కృతుంగా బంకెట్ హాల్లో కాన్సిరాం వర్ధంతి సందర్భంగా స్వేరోస్ ఇంటర్నేషనల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఉప్పులేటి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని స్వేరో నేషనల్ కన్వెన్షన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతల మీద స్వేరో సేవలందించిన గురుకుల విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించి కృషి చేసిందని తెలిపారు. విదేశాల్లో కూడా ఫెరో నెట్వర్క్ ఉందన్నారు. గంజాయి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని వీటన్నిటికీ వ్యతిరేకంగా ఉద్యమాన్ని స్వేరో నెట్వర్క్ త్వరలోనే చేపట్టబోతున్న అని తెలిపారు. స్వయం ఉపాధి పై ఈనెల 27న బెజ్జంకిలో ఇతర రాష్ట్రాల స్వేరో ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కుల మతాల కతీతంగా స్వేరోలో సభ్యత్వం తీసుకోవచ్చని అన్నారు. ఎలాంటి చెడు వ్యసనాలు లేకుండా కుటుంబ సభ్యులచే ధృవీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుందని తద్వారానే సభ్యత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్ర సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాలను రద్దు చేయాలి

- ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ



నవతెలంగాణ-నంగునూరు

డీఎస్సీ నియామకాలను వెంటనే రద్దు చేయాలని, ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత 30 ఏళ్ల నుంచి ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటాలు, అమరుల ప్రాణ త్యాగాల వల్లనే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేపట్టుకోవచ్చని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని మాట్లాడారని తెలిపారు. అయితే తీర్పు వచ్చే ఇప్పటికి 2నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కేవలం ఒక కమిటీ వేయడం జరిగింది, తప్ప వర్గీకరణ పై ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఆయా ఉద్యోగాల నోటిఫికేషన్లు, ఫలితాలు ఇస్తున్నారని నియామకాల ప్రక్రియ వేగవంతం చేస్తున్నారని, కానీ వర్గీకరణ పై ఒక అడుగు కూడా ముందు పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేపట్టకుండా, రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ చేపడితే మాదిగ, మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించి నియమకాలు చేపట్టకుండా ఉన్న ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ ఎస్సీ వర్గీకరణ అమలయ్యే విధంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చే విధంగా చూడాలని కోరారు. లేకుంటే ఆయా నోటిఫికేషన్లు రద్దుచేసి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నర్సింలు, మండల అధికారి ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, దేవులపల్లి కర్ణాకర్, కందికట్ల కిషన్, నాగిళ్ల రవీందర్, దమ్మగల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఓవైపు ఆధ్యాత్మికం..మరోవైపు డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన

- యువ కిరణం స్పోర్ట్స్' సభ్యులకు ప్రశంసలు



నవతెలంగాణ-దుబ్బాక

ఓవైపు ఆధ్యాత్మిక ధోరణిని పెంపొందిస్తూ.. మరోవైపు డ్రగ్స్ నిర్మూలన పట్ల ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని "యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్" ప్రతినిధులు దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వీరు నెలకొల్పిన మండపం వద్ద మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిమణామాలను, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేలా పలు సూచనలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు ఆ ఫ్లెక్సీని ఆసక్తిగా చదువుతున్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని పంచుతున్న 'యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్' ప్రతినిధులను పట్టణవాసులు ప్రశంసిస్తున్నారు.

ఉపాధ్యాయ బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన డీఈఓ



నవతెలంగాణ-సిద్దిపేట

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకోవడానికి ఎల్ బీ స్టేడియానికి బయలుదేరుతున్న బస్సులకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యెన్నం మల్లారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

యెన్నం మల్లారెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండలం జప్తిలింగారెడ్డి పల్లి గ్రామంలో గత 4 నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతు అకస్మా త్తుగా మృతి చెందిన మల్లారెడ్డి కుటుంబ సభ్యులు పీఏసీఎస్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ చైర్మెన్, గ్రామ సర్పంచ్‌గా, కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా పార్టీ ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి అని గుర్తు చేసుకొని వాళ్ల కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, ఫిషర్మెన్ స్టేట్ జనరల్ సెక్రటరీ రేపాక తిరుపతి, సీనియర్ నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, చిలీవేరి రాంరెడ్డి, యెన్నం భూపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, బెజ్జనబోయిన అనిల్, పంది రాజు, ఒళపు నారాయణ, సంతోష్, ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షులు ప్రవీణ్, ప్రశాంత్ తదితరాలు పాల్గొన్నారు.

మాన్యశ్రీ కాన్సిరామ్ 18 వ వర్ధంతి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బహుజన సమాజ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్సిరామ్ 18 వ వర్ధంతిని బుధవారం హుస్నాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బహుజన సమాజ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతికి సెలవు ప్రకటించాలని బహుజనులతో కలిసి 1965 అప్పుడున్న కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని అన్నారు. ఢిల్లీ, ఏడు రాష్ట్రాలు వంద మంది బహుజనులతో సైకిళ్లపై 40 రోజులు నాలుగు వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి బహుజనులను చైతన్యపరిచారన్నారు. బహుజనుల హక్కుల కొరకు నిరంతరం పోరాడిన మాన్యశ్రీ కాన్సిరాం భారతరత్న అవార్డు అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు డేగల వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నియోజకవర్గ కన్వీనర్ వెలుపుల రాజు, మండల అధ్యక్షులు దుంద్ర రాంబాబు, బోయిని బాబు, విక్రమ్, అరుణ్, మొగిలి పాక శ్రీనివాస్, కామెర లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-రాయపోల్

వరి పంటలో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్కల్ గ్రామ పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రత్తి, వరి పంటల్లో వచ్చే చీడ పీడల, తెగుళ్ల నివారణ కోసం రైతులకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించటం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, కంపునల్లి, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రైతులు క్లోర్ పైరిఫాస్ 20శాతం ఈసీ 400 మీ లీ ం ప్రోపికొనజోల్ 25శాతం ఈసీ 200 మీ.లీ ఎకరానికి కలిపి పిచికారి చెయ్యటం ద్వారా నివారించవచ్చని తెలిపారు. వరిలో తెల్ల కంకి, గింజమచ్చ నుంచి నివారించవచ్చని తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడి కుటుంబానికి కార్మికుల భరోసా



నవతెలంగాణ-రాయపోల్

అనారోగ్యంతో మృతి చెందిన హమాలీ కార్మికుని కుటుంబానికి తోటి హమాలీ కార్మికులు ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో హమాలీ కార్మికుడు కొల్గూరు రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వడ్డేపల్లి హమాలీ సంఘం కార్మికులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాములు నిత్యం కష్టపడి హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని అలాంటి కుటుంబ యజమాని మృతి చెందితే ఆ కుటుంబం పెద్ద దిక్కున కోల్పోతుంది.రాములు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు జనముల శ్యామనాథ్, నుచ్చు నర్సయ్య, మన్నె మురళి, కాస కుమార్ , చాకలి సత్తయ్య , తప్పని సుధాకర్ ,చాకలి యాదయ్య, చాకలి ఎల్లయ్య పాల్గొన్నారు.

బాలల రక్షణ సంరక్షణ పై అవగాహన



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలల రక్షణ, సంరక్షణ పై మహిళా శిశు సంక్షేమా శాఖ, బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చైల్డ్ రైట్స్ పోక్సో ఆక్ట్, సెల్ఫ్ అవేర్నెస్ బాల కార్మికుల గురించి, చైల్డ్ మ్యారేజ్ గురించి పిల్లలకి అవగాహన కల్పించామన్నారు. జీరో 0 నుంచి 18 ఏండ్ల బాల బాలికల రక్షణ, సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ పనిచేస్తుందన్నారు. స్కూల్ డ్రాప్ అవుట్ స్టూడెంట్స్, బాలల అబ్యూజ్, బాల కార్మికుల వ్యవస్థ, బాలలకు ఏ సమస్య వచ్చినా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి కాల్ చేయాలని తెలిపారు. చైల్డ్ హెల్ప్ లైన్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమలో బాలల పరిరక్షణ విభాగం నుంచి కనకరాజు, గ్రామ కార్యదర్శి యాదగిరి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడ బిడ్డలకు బతుకమ్మ పండగ శుభాకాంక్షలు

- కాంగ్రెస్ సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ ఆడ బిడ్డలకు కాంగ్రెస్ సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లా డుతూ.. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై, సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయని, అలిగిన బతుకమ్మ ఒక్క రోజు మినహా మిగతా ఎనిమిది రోజులు వైవిధ్యమైన నైవేద్యాలు అమ్మవారికి మహిళలు సమర్పిస్తారని అన్నారు. పల్లె పల్లెలో ఆట పాటలతో, సంస్కృతీ సంప్రదాయాలతో బతుకమ్మ పండగ సంతోషంగా చేసుకోవాలని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత



నవతెలంగాణ-దుబ్బాక

బతుకమ్మ, దసరా పండుగలను పురస్క రించు కొని బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులైన డప్పు మహేష్, ఆస ఎల్లవ్వ, చుక్క తారవ్వలకు వార్డు కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ పండగల్ని సంతోషంగా చేసుకోవాలన్న కాంక్షతో ప్రతి ఏటా తన సొంత ఖర్చులతో కొత్త బట్టలను పంపిణీ చేయడం జరుగు తుందన్నారు. అనంతరం ప్రజలకు బతుకమ్మ, దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ అస్తిత్వం బతుకమ్మను ఆవిష్కరించిన రుస్తుం



నవతెలంగాణ-సిద్దిపేట

సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని స్థానిక రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ చిత్రాలను అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రపంచంలోనే ఫ్లవర్ ఫెస్టివల్ బతుకమ్మ పండుగ రాష్ట్రానికి ప్రత్యేక మైనదన్నారు. సమాజంలో ఊరు ఊరంతా ఆడపడుచులు ఐకమత్యంతో, కలసిమెలసి ఆటపాటలతో, రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చి, సబ్బండవర్గాలు సంబరాలు చేసుకుం టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ గ్యాలరీ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబినారుస్తుం, మొహమ్మద్ సాధిక్, ఎండి రహీం పాల్గొన్నారు.

వచ్చేనెల 8 నుంచి సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ టోర్నీ

- కాంగ్రెస్ నేత, న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నవంబర్ 8వ తేదీ నుంచి సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ నేత, హైకోర్ట్ న్యాయవాది గడ్డం శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో గెలుపొందిన విజేతకు రూ.2 లక్షలు, రన్నరప్‌కు ఒక లక్ష, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.50 వేలు, అత్యధిక వికెట్లు తీసిన వారికి రూ.25 వేలు ప్రైజ్ మనీగా అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకుల మద్దతుతో ఈ టోర్నీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్సాహవంతులైన యువకులు ఈ టోర్నీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

ప్రభుత్వ పథకాలు పేదలకు వరం




- గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ పథకాలు పేదలకు వరంగా మారు తాయని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. బుధవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు 857 కళ్యాణ్ లక్ష్మీ, 87 షాద్ ముబారక్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న మాజీ జెడ్పీటీసీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ పంగ మల్లేశం జన్మదిన వేడుకల సందర్భంగా మాజీ సీఎం గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను కలిసిఆశీర్వాదని తీసుకున్నారు. బుధవారం మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసా య క్షేత్రంలో కేసీఆర్‌ను కలిశారు. ఆయనతోపాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి ఉన్నారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు



నవతెలంగాణ-నంగునూరు

బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా మండల కేంద్రమైన సద్దుల బతుకమ్మ నిమజ్జనంకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తెలియజేశారు. బతుకమ్మల నిమజ్జనం కోసం నల్ల పోచమ్మ దేవాలయం వెళ్ళే రోడ్డు మార్గంలో బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం, లోతట్టు ప్రదేశాలలో దాదాపు 200 ట్రిప్పుల మొరం పోయించడం జరిగిందని తెలిపారు. మురికి కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగిందని తెలిపారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లోని స్థలమునకు, చెరువుల వద్ద స్థలమును చదును చేయించడం జరిగిందన్నారు. గ్రామంలో స్ట్రీట్ లైట్స్ వేయడం జరిగిందని, బతుకమ్మ ఘాట్‌లకు కలర్స్ వేయడం జరిగిందని చెప్పారు.


వైద్యురాలి హత్య కేసులో ప్రభుత్వం ధోరణి మార్చుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్.జి.కార్ మెడికల్ కాలేజ్ వైద్యురాలి హత్యకేసులో బెంగాల్ ప్రభుత్వం ధోరణిని మార్చుకోవాలని పట్టణంలోని జూనియర్ డాక్టర్‌లు డిమాండ్ చేశారు. బెంగాల్ ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. భారతీయ వైద్యులకు సరైన గౌరవం, న్యాయం దక్కాలని నినదిస్తూ, బెంగాల్ రాష్ట్ర వైద్యులకు మద్దతు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు.

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని బద్దిపడగ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేముల కొండల్ రెడ్డి(48) గత కొద్ది రోజుల నుంచి పిట్స్ రోగంతో బాధపడుతున్నాడు. గ్రామస్తుల తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..పిట్స్ నయం కోసం మందులు వాడటం వలన మతిస్థిమితం కోల్పోయినాడు. మంగళవారం ఉదయం బావి దగ్గరికి వెళ్ళొస్తానని ఇంట్లో చెప్పి, వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దానితో అతని కొడుకు వేముల లోకేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్ తెలిపారు.

దుర్గమాతను దర్శించుకున్న మాజీ వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి మర్కుక్ మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గుఱ్రాల స్వామి, దుర్గామాత భక్తమండలి, యువకులు, తదితరులున్నారు

అనుమానస్పద కదలికలపై సమాచారం ఇవ్వండి

- హుస్నాబాద్‌లో కార్డెన్ సెర్చ్
- 15 మోటార్ సైకిళ్ళు, 5 ఆటోలు సీజ్
- హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో అనుమానస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని నాగారం రోడ్డులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఆయన ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. నార్కటిక్స్ డాగ్స్ తో అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి పేపర్లు లేని 15 మోటార్ సైకిళ్ళు, 5 ఆటోలు సీజ్ చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. కార్డెన్ సెర్చ్‌తో ప్రజల రక్షణ భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టణాల్లో కాలనీల్లో గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని, నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని అన్నారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈనెల జూలై 1 నుంచి భారతదేశ వ్యాప్తంగా నూతన చట్టాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ చట్టాల్లో నేరం చేసిన నేరస్తులకు కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీ టీఎస్ కాప్ అధునాతన యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నషన్ సిస్టం ద్వారా అనుమానితుల ఫోటో తీసి చెక్ చేయడం ద్వారా ఎవరైనా పాత నేరస్తులు నేరం చేసి ఉంటే వెంటనే వారి ఫోటో వారి బయోడేటా వారు చేసిన నేరం వివరాలు క్షణంలోనే తెలిసిపోతాయనీ, పాత నేరస్తుల ఫోటోలు తీసి, ఫింగర్ ప్రింట్ ద్వారా చెక్ చేయడం జరిగిందని తెలిపినారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా గ్రామాలలోని ప్రజలు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు వ్యాపారస్తులు గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు, వివిధ యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. స్వాధీ నం చేసుకున్న వాహనాలను యజమానులు వాటికి సంబంధించిన పత్రాలు చూపించిన తర్వాత తిరిగి వారి వాహనాలను వారికే అప్పగించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం నిషేధించిన గంజాయి, గుట్కాలు అమ్ముతున్నా కలిగి ఉన్న వారి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలపాలని ,డయల్ 100 కాల్ కు ఫోన్ చేసినాచో వెంటనే చర్యలు చేపడతామని, యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని అన్నారు. ఈ కార్యక్ర మంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్, కోహెడ ఎస్ఐ అభిలాష్, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్, సర్కిల్ పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ

నవతెలంగాణ-కొండపాక

సీ॥
తెలగాణ రాష్ట్రాన తేజమ్ము నింపగా
కళ్యాణరుచి బతుకమ్మయాట
మహిళామణులు గూడి మాధుర్యమొప్పగా
గళసీమ నగ బతుకమ్మ పాట
భారతాది కథలు, భాగవతమ్మును
కమనీయమౌ బతుకమ్మ గాథ
ఆనందమందైన ఆవేశమందైన
కదిలించునీ బతుకమ్మ మాట

తే.గీ॥
అలసి సొలసిన హృదయాల యార్తిదీర్చి
పారవశ్యము గల్గించి భక్తి పెంచి
సకల జనులకు సౌభాగ్య సంపదొసగి
బ్రతుకు నేర్పెడి బతుకమ్మ! వందనాలు!



-గొల్లపల్లి రఘురామ శర్మ
దుద్దెడ
9989149454

సద్దుల బతుకమ్మ, దసరా సంబురంగా చేసుకోవాలి

- చైర్ పర్సన్ వనిత



నవతెలంగాణ-దుబ్బాక

సద్దుల బతుకమ్మ దసరా పండుగలను సంబ రంగా చేసుకోవాలని మున్సి పల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, పెయింటింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్ తో కలిసి ఆమె పర్యవేక్షిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..రూ.15 లక్షల జనరల్ ఫండ్స్ తో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో చెరువుల వద్ద లైటింగ్, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలో ని మహిళలు బతుకమ్మ సంబరాలను ఆనందోత్స వాల మధ్య నిర్వహించుకోవాలని సూచించారు.

పండగల వేళ పస్తులుంచుతు(న్రు ..

గతంలో కేసీఆర్ సర్కార్ బతుకమ్మ సంబరాల కోసం ప్రత్యేక నిధుల్ని విడుదల చేసి మహిళలకు బతుకమ్మ కానుకగా ఉచితంగా చీరలు పంపిణీ చేసేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ నేడు బతుకమ్మ పండుగకు చీరలు కాదు కదా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. పండగల వేళ మహిళల్ని పస్తులుంచుతున్నారని.. రాబోవు రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది బూస ప్రవీణ్ కుమార్ పలువురున్నారు.

కులమతం లేని సమాజం ఏర్పరుచుకోవాలి

- గజ్వేల్ మండలం అక్కారంలో బహుజన బతుకమ్మ
- అరుణోదయ సంస్కృతి సమైక్య జాగృతి అధ్యక్షురాలు విమలక్క



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

కులమతం లేని సమాజం ఏర్పాటు చేసుకునేందుకు మహిళలు నడుం బిగించాలని అరుణోదయ సంస్కృతి సమైక్య జాగృతి అధ్యక్షురాలు విమలక్క అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం అక్కారంలో బహుజన బతుకమ్మ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాన్ని బతుకమ్మ పండుగలో కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుందన్నారు. మహిళలపై పెరుగుతున్న లైంగిక దాడులను నిరసిస్తూ స్త్రీలు గౌరవంగా జీవించే హక్కులను చాటిచెప్పే బహుజన బతుకమ్మ అన్నారు. ఎనిమిదవ రోజు బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా బహుజన బతుకమ్మ అడమన్నారు. అక్కారం గ్రామం ఆదర్శంగా గ్రామంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిందన్నారు. ఆడబిడ్డలను బలికించుకుందామని కులమతంలేని సమాజం కావాలని ప్రకృతిని గౌరవించి మహిళలు గౌరవిస్తే మన మహిళల మనుగడ ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలోని ఆడే బతుకమ్మ ఏ విధంగా ఉందో, ఈసారి ఎలా ఉందని గ్రామస్తులను అడిగారు. శ్రమజీవుల, బహుజనల పూల పండగ బతుకమ్మ అన్నారు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల మహిళలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు అన్ని రకాల హింసలు జరుగుతున్నాయన్నారు. ఈ హింసల పై మహిళలు లైంగిక దాడులకు వ్యతిరేకంగా మనమంతా ఉద్యమిస్తేనే అవన్నీ అరికట్టవచ్చన్నారు. పట్టణాల నుంచి గ్రామాలకు పాకినటువంటి గంజాయి మద్యపానాన్ని నిషేధిస్తేనే సమాజం బాగుపడుతుందన్నారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు ఆగుతాయని అందరికీ స్పష్టంగా వివరిస్తూ ప్రభుత్వం వీటిపై చొరవ చూపాలన్నారు. చెరువులు, వాగులు, వంకలను అడవులను గుట్టలను మనం కాపాడుకుంటేనే బతుకమ్మ బతుకుతుందన్నారు. బతుకమ్మ లోనే అమ్మ ఉంది ఆ అమ్మను కాపాడుకుంటే మనమంతా క్షేమంగా ఉంటామని బహుజన బతుకమ్మ చాటి చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఫ్రీ జోన్ పై అవగాహన

- యువత క్రీడలపై మక్కువ చూపించాలి
- క్రీడా పోటీల్లో పాల్గొన్న యువత



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

యువత డ్రగ్స్ వైపు, మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపకుండా క్రీడల వైపు మొగ్గుచూపి క్రీడల్లో రాణించి భవిష్యత్తులో చక్కటి జీవితాన్ని అందుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో డ్రగ్ ఫ్రీ జోన్ అనే అంశంపై యువతకు అవగాహన కల్పిస్తూ దసరా సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా మానసిక శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. డ్రగ్స్ వంటి హానికరమైన పదార్థాల నుంచి యువత దూరంగా ఉంచేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. డ్రగ్స్ వలన బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్ బ్యాడ్మింటన్ ఇతర ఇండోర్ గేములు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువత, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన అంటే గృహనిర్బంధమేనా ..?

- ఎమ్మెల్యేను అడ్డుకోవడం పట్ల బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం



నవతెలంగాణ-దుబ్బాక

తమది ప్రజా పాలన అంటూ గొప్పలు అనుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేను నిర్బంధిస్తూ పోలీసు పాలనను కొనసాగిస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్, ఆస యాదగిరి మాట్లాడుతూ.. బతుకమ్మ దసరా పండుగ ఏర్పాట్లను పరిశీలించేందుకు దుబ్బాకకు వస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసం దగ్గర పోలీసులు గృహనిర్బంధం చేయడం కాంగ్రెస్ సర్కార్ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ కు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ నిరసనలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గన్నె భూమిరెడ్డి, నందాల శ్రీకాంత్, ముక్కపల్లి శ్రీనివాస్, పడాల నరేష్, లొంక లచ్చయ్య, యాదగిరి ఉన్నారు.

దుర్గామాత సన్నిధిలో నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన రంగనాయక స్వామి దేవాలయంలో నెలకొల్పిన దుర్గ మాత దేవిని బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మర్కుక్ మండలా ధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొర్సు ప్రశాంత్ రెడ్డి, సాయిరెడ్డి శంకర్ రెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్ రెడ్డి, శివ, తదితరులున్నారు.

దుబ్బాక ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

నియోజకవర్గంలో పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని దుర్గామాతను వేడుకున్నట్లు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ వారు నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయనను మండప నిర్వాహకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్, కొంగర రవి, కడ్దూరి నరేందర్ రెడ్డి, మచ్చ శ్రీనివాస్, శ్రీరామ్ నరేందర్, బిళ్ళ బాలరాజు, ఐరేని సాయితేజ గౌడ్, పలువురు పాల్గొన్నారు.

బీఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం



నవతెలంగాణ-కొమురవెల్లి

బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గౌరయపల్లిలో ఇటీవల కొయ్యడ శ్రీనివాస్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజేందర్ రెడ్డి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. బీఆర్ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యడ మల్లేశం, బొచ్చు మహేష్, కొయ్యడ శ్రీనివాస్, కొయ్యడ అంజయ్య, రాకేష్, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా దుర్గామాత ఉత్సవాలు

నవతెలంగాణ-గజ్వేల్

దేవీ నవరాత్రి ఉత్సవాల భాగంగా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని వేముల గట్టు గ్రామంలో దేవీ నవరాత్రులు బుధవారం ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు వరద నాగరాజు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు సీఎంకు ఉంటాయని ఆయన అన్నారు. మల్లన్న సాగర్ పరిధిలోని వేముల గట్టు ప్రజలకు దుర్గామాత చల్లగా చూస్తుందని ఆయన చెప్పారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నమని ఆయన పేర్కొన్నారు.

దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా మండలం తిమ్మాయిపల్లి గ్రామం మహంకాళి అమ్మవారి గుడి సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం అమ్మవారు సరస్వతి దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. గ్రామ మహిళలతో సామూహిక కుంకుమార్చన, అనంతరం గణపతి హెూమం, లక్ష్మీ గణపతి హెూమం, దుర్గాదేవి హెూమం నిర్వహించారు. ది రాక్ స్టార్ యూత్, రెడ్డి సంఘం సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, ఆలయ పురోహితుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ కుంకుమార్చన,హెూమం చేయడం ద్వారా సంసారిక జీవితంలో ఆటంకాలు తొలిగిపోవడం సమస్యల నుంచి బయటపడడం, సుఖశాంతులతో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఏలా లత కృష్ణ, రెడ్డి సంఘం సభ్యులు, రాక్ స్టార్ సభ్యులు, గ్రామ మహిళలు, చిన్నారులు, భక్తులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని దుర్గామాత మండపం వద్ద మహిళలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మహిళలు అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలమాకుల గ్రామంలో

మండలంలోని పాలమాకుల గ్రామంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం దుర్గదేవి అమ్మవారిని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్యలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేణు చక్రవర్తి, పరమేశ్వర్, ఐలయ్య, శివశంకర్, ఓజల్, చింటు గౌడ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

దుర్గ మాత అమ్మ వారికి విరాళం

నవతెలంగాణ-నంగునూరు

మండలం సిద్ధన్నపేట గ్రామంలో యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గ మాత అమ్మవారికి మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి రూ.15,116 వేలు విరాళాన్ని అందజేశారు. దుర్గ మాత సభ్యులు బెదురు తిరుపతిని అభినం దించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

సరస్వతీ దేవిగా దర్శనం

-వైభోవపేతంగా కుంకుమ పూజ..



నవతెలంగాణ-బెజ్జంకి

దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా దుర్గాదేవి బుధవారం సరస్వతీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రం లోని ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపం వద్ద నిర్వహకులు ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హజరై ప్రత్యేక పూజలు చేశారు.

మహంకాళి మాత ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ లోని మహంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పురోహితులు నంద బాల శర్మ ఆధ్వర్యంలో హెూమం కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాంభవి మాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన మహంకాళి మాత, ఈ వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ.. హెూమం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అందరూ బాగుండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు.

ఎనిమిదో రోజు బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-నంగునూరు



తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా నిర్వహించుకొనే బతుకమ్మ సంబురాల్లో ఎనిమిదో రోజైన బుధవారం నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. వెన్న ముద్దల బతుకమ్మ పేరుతో వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చారు. సాయంత్రం ఆటపాటలతో మహిళలు వేడుకలు చేసుకున్నారు. చిన్నలు నుంచి పెద్దల వరకు బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు.

చిన్న పది పైసల నానాలతో పెద్ద బతుకమ్మ



నవతెలంగాణ-గజ్వేల్

బతుకమ్మ పండుగలో చివరి 9వ రోజు సద్దుల బతుకమ్మ. ఈ సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా అరుదైన ఆనాటి చిన్న పది పైసల నాణాలతో బతుకమ్మను రామకోటి రామరాజు తయారు చేశారు. (1988 ఏడాది నాటివి) 2000 వేలకు పైగా నాణాలు ఉపయోగించి పెద్ద బతుకమ్మను అత్యద్భుతంగా తయారు చేసి బుధవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1988 సంవత్సరం లో ఉపయోగించిన అరుదైన నానాలతో ఈ సద్దుల బతుకమ్మను వినూతన ఆలోచనతో తయారు చేశారు. ఈ బతుకమ్మను తన ఆడపడుచు అయినటువంటి తన అక్క గారైన సంధ్యరానికి అంకితంగా ఇస్తునని తెలిపారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంధాల నిలవాలని ఉయ్యాలో
అందాల పూలని ఉయ్యాలో
తీర్చినట్టి రీతి ఉయ్యాలో
అందరి మనసుల్లో ఉయ్యాలో
ప్రేమపూలు విరియాలి ఉయ్యాలో
మానవతన్నది ఉయ్యాలో
ఒక్కటై నిలవాలి ఉయ్యాలో
బతుకుతూనే మనమంతా ఉయ్యాలో
బతుకును ఇవ్వాలి ఉయ్యాలో
గోగు పూల లాగా ఉయ్యాలో...
గోదారమ్మ లాగా ఉయ్యాలో
జగతిన ఉండాలి ఉయ్యాలో
ఉన్నదాంట్లోనే ఉయ్యాలో
ఊరికి పంచాలి ఉయ్యాలో
ఈర్ష్య, ద్వేషాలు ఉయ్యాలో
ఇసుమంత కూడదు ఉయ్యాలో
ఎవ్వరి బతుకెప్పుడు ఉయ్యాలో
ఏ రీతి ముగియునో ఉయ్యాలో
ఎవ్వరెరుగరు జగతిన ఉయ్యాలో
ఉన్నపుడే నీవు ఉయ్యాలో
ఉన్న దాంట్లోనే నీవు ఉయ్యాలో
లేనివారికి పంచు ఉయ్యాలో
లేమిని తెగ తెంచు ఉయ్యాలో
నీవు చేసే సేవ ఉయ్యాలో
నల్గురికి తోవ ఉయ్యాలో



- రచన
మంగళగిరి రామచంద్రమూర్తి,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు
చేర్యాల

నవతెలంగాణ-చేర్యాల